

# మెహెర్‌బాబా

**అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక**

సంపుటి :21 సంచిక: 06 హైదరాబాద్ 2021 సెప్టెంబరు పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com** **వార్షిక సభ్యత్వం : రూ.100/-**

# నమోస్తుతే!

# సద్గురు వందితాయ!!

(డాక్టర్ మల్లాది శారద)

మెహెర్‌బాబా 1949 అక్టోబరు 16న నవజీవనం కార్యక్రమం చేపట్టారు. బాబావారు చేపట్టిన నవజీవనం ఎంతటి కష్టమైనదో పాఠకులందరికీ తెలుసు. నవజీవనం చేపట్టేనాటికి బాబావారి వయస్సు 55 సంవత్సరాలు. 1949కి పూర్వమే అంటే 1931-1938 నడుమ బాబా పలుమార్లు యూరోపు, అమెరికా, టర్కీ, జపాన్, చైనాలను సందర్శించారు. బాబా తన విదేశీ పర్యటనల్ని 1931లో లండన్‌తో ప్రారభించారు. బాబావారి దర్శనంతో పాశ్చాత్య ప్రేమికుల హృదయాలలో ఆనందం వెల్లివిరిసింది. ఎందరో తమ ఆరాధ్య దైవమైన ఏసుప్రభువుని అవతారునిలో దర్శించుకున్నారు. అనంతరం, అవతారునికి కడదాకా అంకితమై విధేయతతో తమ సేవలందజేశారు. 1939లో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యింది. సర్వజ్ఞుడైన అవతారుడు యుద్ధ సమయంలో వుండే అనేక ఆంక్షలను ముందుగానే వూహించి, తన విదేశీ పర్యటనలను 1938 కంటే ముందుగానే పూర్తిచేశాడు. ఈ అవతారకాలంలో తన వారందరికి ఆయా దేశాలలో దర్శన, ఆలింగన భాగ్యం కల్పించాడు. ఆ వివరాలలోకి వెళ్తే, బాబా యూరోప్‌కి 12 సార్లు, ఇంగ్లాండుకి ఎనిమిదిసార్లు, అమెరికా మూడుసార్లు పర్యటించారు. 1939 నుండి బాబావారి విశ్వ ఆధ్యాత్మిక కార్యక్రమ వేగం మరింత పుంజుకుంది. 1939 -1949 నడుమ బాబా భారతదేశంలో సుమారు 75వేల మైళ్ళ దూరం ప్రయాణించారు. భారతదేశం స్వాతంత్ర్య ఉద్యమ పోరాటాలతో సతమవుతున్న సమయమది. రవాణా సౌకర్యం అంతంత మాత్రంగా వున్న ఆ రోజుల్లో అనేక ఇక్కట్లు ఎదుర్కొని సుమారు 20 వేల మంది మస్తులతో బాబా సాంగత్యం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుజరాత్ - ఏడుసార్లు, శ్రీలంక - రెండుసార్లు, కాశ్మీర్-మూడుసార్లు వాయవ్య సరిహద్దుల్లో ఆరుసార్లు, దక్షిణ దేశం -పన్నెండుసార్లు, కలకత్తా- రెండుసార్లు పర్యటించారు. ఈ పర్యటనలలో ఎందరో సాధువులను, ఫకీర్లను, అనేకమంది బీదవారిని కలిశారు. 1949 అక్టోబరు 16 నుండి 1952 దాకా సుమారు రెండున్నర సంవత్సరాలు బాబా నవజీవనం గడిపారు. 1952 తర్వాత నుండి 1965 నడుమ బాబా బహిరంగ దర్శన కార్యక్రమాలకు అనుమతించారు. ఈ సమయంలో బాబా తన ప్రేమికులకు దర్శన, ఆలింగన భాగ్యం కల్పించారు. ఆ దరిమిలా ఎక్కువగా ఏకాంతవాసంలోనే వున్నారని చెప్పాలి. 1969 జనవరి 31 తర్వాత మెహెరాబాద్‌లో అవతారుని నిత్యదర్శనం లభిస్తోంది.

## బాబా సందేశం

**ఇతరులు మీ చెడును కోరవచ్చును కాని,**
**మీరు మాత్రము వారి మంచినే కోరాలి.**

**గౌరవ సంపాదకులు**
**దాక్టర్ మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**malladisukku@gmail.com**

### మనవి

**మీ వ్యాసాలు, ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేది లోపల పంపవలసింది. పత్రికను ప్రతినెలా 26న పోస్టు చేస్తున్నాం. 28వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

## లోపలి పేజీలలో...


| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | బైదుల్ | 6-11 |
| 3. | నవజీవన స్మృతి కేంద్రం | 12-16 |
| 4. | ప్రేమ - భక్తి | 17-18 |
| 5. | లార్డ్ మెహెర్ | 20-28 |
| 6 | భగవంతుడు మరియు ప్రేమ | 29 |
| 7. | మెహెరాబాద్ సహవాస్ | 30-33 |
| 8. | కృష్ణ నాయర్‌కిచ్చిన ఆదేశం | 34-37 |
| 9 | ప్రార్థనలు | 38-39 |


### మనవి

**ఈ ప్రచురణలోని రచనలు, అందలి భావాలు సంబంధిత రచయితలవేనని పాఠకులు గమనించగలరు.**

Please visit : www.srimeherbaba.com

# కారులో మెహెరాబాద్‌కి...

మెహెరాబాద్‌కు సొంతకార్లలో వెళ్ళాలనుకునే వారికి ప్రధానంగా మూడు మార్గాలున్నాయి. అన్నింటిలో రూట్ నంబరు -3 శ్రేష్ఠమని మా అభిప్రాయం. ఈ మార్గంలో ట్రాఫిక్ ఎక్కువే. ఐనప్పటికి చక్కని జాతీయ రహదారిపై సుళువుగా వెళ్ళొచ్చు. మిగిలిన మార్గాలలోని రహదార్లకు అక్కడక్కడ మరమ్మత్తులు అవసరమని చెప్పాలి. మీకు వీలయితే, మీకిష్టమైన మార్గంలో మెహెరాబాద్ వెళ్ళడానికి ప్రయత్నించండి. జైబాబా.

### రూట్ -1

హైదరాబాద్ (కోఠి) - పటాన్‌చెరువు - సంగారెడ్డి క్రాస్ రోడ్స్ - జహీరాబాద్ - హుమానాబాద్ - ఉమర్‌గా - నల్‌దుర్గ్ - తుల్జాపూర్ - ఉస్మానాబాద్ - భూమ్ - జామ్‌ఖేడ్ - అహ్మద్‌నగర్ - మెహెరాబాద్ (515 కిమీ)

### రూట్ -2

హైదరాబాద్ (కోఠి) - పటాన్‌చెరువు - సంగారెడ్డి క్రాస్ రోడ్స్ - జహీరాబాద్ - హుమానాబాద్ - ఉమర్‌గా - నల్‌దుర్గ్ - షోలాపూర్ - టింబర్ని - జేవూర్ - కర్మాలా - మీరజ్ గావ్ - ఆరంగం గావ్ - మెహెరాబాద్ (552 కిమీ)

### రూట్ -3

హైదరాబాద్ (కోఠి) - పటాన్‌చెరువు - సంగారెడ్డి క్రాస్ రోడ్స్ - జహీరాబాద్ - హుమానాబాద్ - ఉమర్‌గా - నల్‌దుర్గ్ - షోలాపూర్ - టింబర్ని- డోండ్ - మెహెరాబాద్ (530 కిమీ).



# మెహెర్‌బాబా పత్రిక కోసం

**మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ ఖర్చుల కోసం**

1. శ్రీమతి కోట ధనలక్ష్మి, తాడేపల్లిగూడెం - రు.1000/-
2. శ్రీమతి బాల సరస్వతి దేవి, విజయవాడ - రు.3000/-

**విరాళంగా పంపారు.**

**వీరందరికి మెహెర్‌బాబా పత్రిక పక్షాన ధన్యవాదములు.**

**జైబాబా.**

## సంపాదకీయం

# నవజీవనం

1949 –1952 నడుమ మెహెర్‌బాబా నవజీవనం పేరిట ఒక క్రొత్త జీవిత విధానాన్ని గడిపారు. నవజీవనం, ఇదొక సత్య జీవన విధానం. కొద్దిమంది సహచరులతో కలిసి బాబా ఈ నూతన జీవితాన్ని సుమారు రెండున్నర సంవత్సరాలు గడిపారు. నవజీవనంలో వుండగా ఎవరూ ఎట్టి పరిస్థితుల్లో అబద్దాలు ఆడరాదు. కోపం ప్రదర్శించరాదు. ధనం ముట్టరాదు. ధనార్జన నిషిద్ధం. భిక్షాటనతో కడుపు నింపుకోవాలి. స్త్రీలను తాకరాదు. ఎవరికీ హాని తలపెట్టరాదు. ఎదుటివారి గురించి చెడు మాట్లాడరాదు. ఎంతటి కష్టంలోనైనా ఆనందంగా వుండాలి. రాజకీయాలు మాట్లాడరాదు. కాలకృత్యాలకు తప్పించి, బాబా అనుమతి లేనిదే ఎవరూ, ఎక్కడికీ వెళ్ళరాదు.

నవజీవన నియమానుసారం ముందుగా, మెహెరాబాద్ కొండపై వున్న బాబా సమాధి మినహా బాబావారి పేరిట వున్న ఆస్తిపాస్తులన్నింటిని అమ్మివేశారు. ఈ యాత్రలో బాబా దేహం ఎక్కడ వదిలినా, బాబా దేహాన్ని మెహెరాబాద్ సమాధిలో భద్రపరచాలని ఆదేశించారు. ఆస్తిపాస్తులు అమ్మివేయగా వచ్చిన నగదుని బాబాపై ఆధారపడిన వారికి అందజేశారు. ఈ యాత్ర ఎక్కువగా కాలినడకన వుండింది. బాబా ప్రేమికులందరికీ బాబా ఎక్కడ వున్నారు, ఎక్కడ ప్రయాణిస్తున్నారు, ఆయన బస ఎక్కడ? ఇత్యాది విషయాలన్నీ అందరికీ తెలుస్తాయి. ఇవేమీ గోప్యం కాదు. ఐనప్పటికీ బాబాని కాని, ఆయనతో వున్న వారిని కలిసే ప్రయత్నం చేయరాదన్నారు. ఉత్తరప్రత్యుత్తరాలు నిషిద్ధమని ఆదేశించారు. ఇన్ని కఠిన నియమాల నడుమ బాబావారి నవజీవన బృందం 1949 అక్టోబరు 20న కర్నాటక రాష్ట్రంలోని బెల్గాంకు చేరుకున్నారు. నవజీవనం నాటికి బాబాకు 55 ఏళ్ళు నిండి సుమారుగా ఆరు నెలలు దాటింది. బాబాతో పాటు మొత్తం 20మంది మండలివారు పాల్గొన్నారు. నవజీవనం రాబోయే తరాల కోసమని బాబా ప్రకటించారు. తన భౌతిక దేహాంతరం కూడా ఈ విధానం కొనసాగుతుందన్నారు.

ఈ జీవనవిధానం తలుచుకుంటేనే మేను గగుర్పొడుస్తుంది.

యావత్తు మానవాళి శ్రేయస్సు కోసం అవతారుడు నవజీవనం పాటించారు.

ఈ తరం బాబా ప్రేమికులు అవతారుడు ఆశించిన సత్య జీవనాన్ని అనుసరించాలనుకోవడం అభిలషణీయం.

***

### తొలితరం మండలి ప్రేమికుడు

# బైదుల్



రుస్తుం జఫ్రాబాది ఇరాని.
బాబా ఈతనికి “ఆఘా బైదుల్” అని
పేరుపెట్టారు. అందుకో కారణం వుంది.
అదేదో మునుముందు తెలుసుకుందాం.
1920వ దశకంలో బైదుల్ పూణేలోని
బాబాజాన్ ఆశ్రమానికి ఎదురుగా
వున్న ఒక టీస్టాల్‌లో పనిచేస్తుండేవాడు.
గుస్తాద్‌జీ ఆ రోజుల్లో బాబాజాన్‌తో
వుండేవాడు. బాబాజాన్ కోసం
గుస్తాద్‌జీ ప్రతిరోజూ బైదుల్ దగ్గర
ఒక కప్పు టీ తీసుకువెళ్ళేవాడు.
గుస్తాద్‌జీ సలహా మేరకు బైదుల్ ప్రతిరోజూ బాబాజాన్ దర్శనం
చేసుకునేవాడు. అలా బైదుల్ వచ్చిపోతుంటే, ఒకరోజున
బాబాజాన్ బైదుల్‌తో ఇలా అన్నది. బిడ్డా ! నా వద్దకు చాలాసార్లు వచ్చావు.
కానీ నీవెప్పుడూ ఏమి ఆడగలేదు అన్నది. దాంతో బైదుల్, అమ్మా!!
“నీ వొక మహా సముద్రానివి, నేనొక బాటసారిని.
ఈ సముద్రంలో దోశెడు నీటికోసం ప్రతిరోజూ వస్తున్నానన్నాడు వినమ్రంగా.
ఆ పిదప, బాబాజాన్ బైదుల్‌ని సాకోరిలో వుంటున్న ఉపాసనీ మహారాజ్ దర్శనం
చేసుకోమని చెప్పింది. ఆమె మాటపై నమ్మకంతో ఉపాసనీ దర్శనం చేసుకున్నాడు.
కానీ, ఆయన “నా వద్దేమి వున్నది?
యిప్పుడు  తాళంచెవి మెహెర్‌బాబాకు అప్పగించాను.
నీవు వెళ్ళి మెహెర్‌బాబాను కలవమని ఉపాసనీ సూచించాడు.
బైదుల్ గుస్తాద్‌జీతో మెహెర్‌బాబా గురించి ప్రసావించగా,
మెహెర్‌బాబా **గురువులకే గురువని,** ఆయన దర్శనం చేసుకొని
ఆశీర్వచనం పొందమని చెప్పాడు.
మెహెర్‌బాబా త్వరలో పూణే వదిలివెళ్ళిపోతున్నాడు.
కాబట్టి టైం వృధా చేసుకోకుండా తక్షణం మెహెర్‌బాబా దర్శనం చేసుకోమని
గుస్తాద్‌జీ సలహా ఇచ్చాడు. అలా బైదులు, తన హొటలు యజమాని అనుమతితో

పూణేలోని కస్బాపేటకు వెళ్ళాడు.
అక్కడ సదాశివ పాటిల్ ఇంటి మేడపై బాబా వున్నారని తెలుసుకుని
మిద్దె మీదకు వెళ్ళాడు. అక్కడ ఓ స్థంభానికి ఆనుకొని సీరియస్‌గా
సితారా వాయిస్తున్న ఆదీ కె ఇరానీని చూసి, ఆతనే మెహెర్‌బాబా అనుకుని
బైదుల్ ఆదీ పాదాలకు నమస్కరించాడు. ఈ హఠాత్సంఘటనకు
ఆదీ దిగ్భ్రాంతితో మీకు ఎవరు కావాలి? మెహెర్ బాబా కావాలా?" అని అడిగాడు.
ఆ పిదప మెహెర్‌బాబా దర్శనం చేసుకుని, ప్రతిరోజూ బాబా దర్శనం చేసుకున్నాడు.
అవతారునిలో తన గురువును దర్శించుకున్నాడు బైదుల్.

**అది 1922వ సంవత్సరం.**

ఆ సమయంలో బాబా పూణే వదిలి బొంబాయి వెడుతున్నారు.
బొంబాయిలో దాదరు రైల్వే స్టేషన్ దగ్గర మంజిల్- ఇ- మీంలో
శిక్షణా కార్యక్రమం ప్రారంభించనున్న తొలిరోజులవి.
బైదుల్‌ని కూడా బొంబాయికి రమ్మనమని బాబా ఆహ్వానించారు.
బాబా ఎక్కడ ఉంటే తానూ అక్కడే వుంటానని మాట ఇచ్చిన బైదుల్ అవతారుడ్ని
అనుసరించాడు. ఆ తర్వాత బైదుల్ తన భార్యా పిల్లలతో బాబాతో వున్నాడు.
బైదుల్ పిల్లలందరూ కూడా బాబా ప్రేమలో పెరిగి పెద్దవారయ్యారు.

## బైదుల్ బిరుదు

ఇంతకీ బైదుల్ అనే పేరు ఎలా వచ్చిందో తెలుసుకుందాం.
బాబాతోపాటు మంజిల్ ఇ మీంలో వుండే రోజుల్లో ప్రతిరోజూ ఏదో
ఒక ఆధ్యాత్మిక గేయం రాస్తుండేవాడు బైదుల్.
అలా రాసిన గేయాల్లోని ప్రతి పంక్తిని బాబా ఎదుట చదివి వినిపించేవాడు.
ఈతని రచనలు ఆధ్యాత్మిక సందేశాన్ని ప్రభోదించేవిలా వున్నాయని,
అతని రచనాశైలికి ముగ్ధులైన బాబా, అతడొక గొప్ప కవి కాబోతున్నాడని.
అందుకు తగిన బిరుదును సూచించాలని మండలితో అన్నారు.
చక్కని పేరొకటి సూచించనుని బాబా తన శిష్యులను ఆజ్ఞాపించారు.
చాలా పేర్లు చెప్పారు కానీ, బాబాకు అవేవీ నచ్చలేదు.
డాక్టర్ ఘని మాత్రం "బైదల్" అనే గొప్ప పర్షియన్ కవి ఒకరున్నారు.
ఈతని రచనలన్నీ ఆ పర్షియన్ రచనలకు పోలివున్నాయి.
ఇంకాచెప్పాలంటే, ఈతని రచనలు బైదల్ కంటే మిన్నగా వున్నాయి.
అందుచేత ఈతని కలం పేరు ఆ బైదల్ పేరుపెడితే బాగుంటుందని సూచించాడు.
బైదుల్ అంటే అత్యంత విలువైన "మార్బుల్ " అని కూడా అర్థం చెప్పొచ్చు.

ఐతే, ఈ కొత్తకవికి "ఆఘా బైదుల్" అనే కలంపేరు పెట్టమని బాబా ఆదేశించారు. అంటే గొప్ప కవి బైదుల్ అని అర్థం.
మిగిలినవారందర్నీ ఈతడ్ని ఇకపై బైదుల్ అని పిలవమని ఆదేశించారు బాబా. అందుకు రుస్తుం సంతోషంగా ఒప్పుకున్నాడు. తనదో కోర్కె వున్నది. మన్నించమంటూ బాబాకు బైదులు ఒక చిన్న కోరిక విన్నవించుకున్నాడు. తనలో కవితా ధోరణి త్రోసుకు వచ్చినప్పుడు, తన మనస్సులో భావాలు పెల్లుబికినప్పుడు, వాటికి అక్షరబద్ధం చేయాలంటే తనకు సరైన టైం దొరకడం లేదు. కాబట్టి, తనకు వచ్చిన భావాల్ని వ్రాసిపెట్టేందుకు వీలుగా ఎవరినైనా సహాయకుడ్ని ఒకరిని ఏర్పాటుచేయమని బైదుల్ అర్థించాడు. అందుకు డాక్టర్ ఘనీ సమర్థుడని, ఆతడ్ని బైదులుకి కార్యదర్శిగా నియమిస్తున్నట్లు బాబా ప్రకటించారు. కవి గారికి ఎప్పుడు భావాలు వస్తే అప్పుడు వెంటనే నోట్ చేసుకోవడానికి వీలుగా బైదుల్ని అంటిపెట్టుకొని వుండమని బాబా డాక్టర్ ఘనీని ఆదేశించారు.

## బైదుల్ "సర్ధార్"

మస్తుల్ని అన్వేషించి వారిని మచ్చికచేసుకోవడంలో బైదుల్‌కి తనకంటూ ఒక ప్రత్యేకత వుంది. బాబా దగ్గరకు ఎందరో ఉన్నతస్థాయి మస్తులను తీసుకొచ్చిన ఘనత బైదుల్‌కి దక్కుతుంది. ఈ విషయమై ఎన్నో సంఘటనలు, ఉదంతాలు ఆయన ఖాతాలో వున్నాయి. 1947 జూన్ 3న బాబా సతారాలో వున్నారు. ఆ సమయంలో ఏడవ భూమికలో వున్న మజూబ్ చాచా అనే మస్తుని బాబా దగ్గరకు తీసుకువచ్చాడు. చాచా మస్తు వందమంది మస్తులతో సమానం అని బాబా కొనియాడారు.

## హోమియో వైద్యం

1955లో బాబా సతారాలో వున్నారు. రోజ్‌వుడ్ బంగళాలో మండలివారుండేవారు. బైదుల్‌కి గతంలో ఆతను ఇరాన్‌లో వుండేరోజుల్లో హోమియో వైద్యం చేసే అలవాటుంది. బాబా నామస్మరణ చేస్తూ, తన దగ్గరకి వైద్యం కోసం వచ్చినవారందరికీ హోమియో వైద్యం చేశేవాడు. తిరిగి సతారాలో తన వైద్యసేవలు ప్రారంభించాడు. వెల్లుల్లిని నూనెలో మరిగించేవాడు. ఎవరు ఏ రోగంతో వచ్చినా ఆ వెల్లుల్లి నూనెను బాబా నామస్మరణ చేస్తూ మందుగా ఇచ్చేవాడు.
రోజూ 60 –70 మంది రోగులు వచ్చేవారు. వేగంగా ఈ వైద్య సేవలు ముగించుకుని బైదల్ రోజ్‌వుడ్ బంగళాకు తిరిగి వెళ్ళిపోయేవాడు. ఐతే, రోజ్‌వుడ్ బంగళాకు దగ్గర్లోనే డాక్టర్ ఏ.ఇ. ఫెర్నాండేజ్ అనే సివిల్ సర్జన్ వుండేవాడు.

వారి కుమారుడు గొంతు నొప్పి వ్యాధితో బాధపడుతున్నాడు.
ఎన్ని మందులు ఇచ్చినా ఆ నొప్పి తగ్గకపోయేసరికి,
ఆ సివిల్ సర్జన్ బైదుల్‌ని వారింటికి పిలిపించాడు.
తమ కుమారుడి రోగం గురించి చెప్పి, తగిన వైద్యం చేయమని కోరారు.
దాంతో బైదుల్ ఎప్పటిలా అవతారుని నామస్మరణ చేస్తూ
తన వెల్లుల్లి నూనె వైద్యం చేశాడు.
ఎంతోకాలంగా బాధపడుతున్న ఆ రుగ్మత నయమైంది. దాంతో, ఆ డాక్టర్ దంపతులు ఎంతగానో సంతోషించారు. ఇదిఇలా వుంటే ఒకరోజున పెండూ పుట్టినరోజు వచ్చింది. ఆ రోజున ఏదైనా ప్రత్యేక వంటకం వండించడం వంటిది వీరి పరిధిలో లేదు. అందుకు బాబా అనుమతి కావాలి. అది సాధ్యం కాదని భావించి ఆ రోజున ఒక హాస్య నాటిక ప్రదర్శిద్దామనుకున్నారు.
ఇంతలో ఎవరూ ఊహించని రీతిలో డాక్టర్ ఫెర్నాండేజ్ గారి ఇంటి నుండి
ఒక స్వీటు బాక్స్ తీసుకుని ఒక వ్యక్తి వచ్చాడు.
ఆతను డాక్టరు గారి గురించి వాకబు చేశాడు.
బైదుల్ తన వైద్య సేవలు ఉచితంగా, ఎవరికి తెలియకుండా గోప్యంగా చేస్తుండేవాడు.
డాక్టరు గారెక్కడ అనగానే డాక్టర్ నీలూ, డాక్టర్ డాంకిన్‌లు ముందుకు వచ్చారు.
ఐతే ఆ వచ్చిన వ్యక్తి వీరు కాదు.
మా డాక్టరు గారి అబ్బాయికి ఘనమైన వైద్యం చేసిన డాక్టరు కావాలి
అంటుండగానే లోపల్నుంచి బైదులు వచ్చాడు.
బైదుల్ని చూడగానే ఆ వ్యక్తి తనతో తీసుకుకొచ్చిన స్వీట్సు ఇచ్చి,
వీటిని మా అమ్మగారు మీ కివ్వమన్నారని చెప్పి వెళ్ళిపోయాడు.
మండలివారందరూ అవాక్కయ్యారు కానీ
వచ్చిన స్వీట్సు తిని పెండూ పుట్టినరోజుని ఘనంగా జరుపుకున్నారు.
బాబా నామస్మరణవల్ల తాను చేసే వైద్యం
ఎలాంటి సమస్యలు లేకుండా విజయవంతమౌతోందని బైదుల్ అంటుండేవాడు.

## అందమైన బాబావారి ఆజ్ఞ

ఒక గొప్ప ధనవంతురాలికి వైద్యం చేసినందుకుగాను
బైదుల్‌కి పెద్ద బహుమానం ఇవ్వబోయింది ఆ ఇల్లాలు.
ఐతే, బైదుల్ తనకు ఎలాంటి బహుమతులు వద్దన్నాడు.
ఎన్నాళ్ళనుండో బాధిస్తున్న చర్మవ్యాధి నయమవడంతో
ఆమె సంతోషంగా ఏదైనా బహుమతి బైదుల్‌కి ఇద్దామనుకుంది.

కాని, బైదుల్ తనకు బహుమతులు ఏమి వద్దు.
కేవలం తన వైద్యం వల్ల ఆమెను దీర్ఘకాలంగా బాధిస్తున్న **'చర్మవ్యాధి నయమైందని'**
ఒక సర్టిఫికేట్ ఇప్పించమని అడిగాడు.
అమె వెంటనే తన లెటర్ ప్యాడ్ మీద బైదుల్ కోరినట్లు రాసి ఇచ్చింది.
బైదుల్ ఆనందానికి అవధులు లేవు.
ఐతే, మండలిలో వున్న ఇద్దరు ప్రముఖ డాక్టర్లు
నీలూ - డాంకిన్‌లకు ఇది నచ్చలేదు.
బైదుల్‌ని ఈ మాదిరిగా ప్రోత్సహిస్తే ఏదో ఒకరోజున
బాబాకు చెడ్డపేరు తీసుకువస్తాడని వారు భావించారు.
బైదుల్ చేసే వైద్యం వారికి సుతరామూ నచ్చలేదు.
ఐనా ఆతడ్ని వారించే శక్తి వాళ్ళకు లేదు.
దాంతో ఈ విషయాన్ని బాబాకు ఫిర్యాదుగా చెప్పారు.
బైదుల్ వైద్యంతో చాలా జాగ్రత్తగా వుండాలని చెప్తారు.
వారిద్దరూ చెప్పిన మాట సరైనదేనని బాబా అంగీకరించారు.
వెంటనే బైదుల్‌ని పిలిపించారు.
బైదుల్, డాంకిన్, నీలూ తదితర మండలి సభ్యులందరూ
బాబా ఎదుట హాజరయ్యారు.

**అవతారుని చమత్కారం.**

బైదుల్ వైద్యం చేయడం ఆపివేయాలని బాబా ఆదేశిస్తే,
డాంకిన్ నీలూలు ఇద్దరూ సంతోషిస్తారు. కాని బైదుల్ మనస్సు చివుక్కుమంటుంది.
ఆతను బాధపడతాడు. అందుకేనన్నట్లు,
ఇకపై బైదుల్ తమ బంగళా వదలి బయట ఎక్కడకూ వెళ్ళి
వైద్యం చేయరాదని ఆదేశించారు.
ఎవరైనా తన దగ్గరకు వస్తే వైద్యం చేయడానికి అనుమతించ్చారు.
బాబావారి ఈ ఆదేశం అందరికీ ఆనందాన్ని ఇచ్చింది.
ఐతే ఏమైయ్యిందనుకున్నారు..
అంత గొప్ప ధనవంతురాలికి వచ్చిన రుగ్మతనే నయం చేసిన గొప్ప వైద్యునిగా
ఆనోట ఈ నోట బైదుల్ ఖ్యాతి మరింత విస్తరించింది.
దాంతో ప్రతిరోజూ బైదుల్ దగ్గరకు వచ్చే రోగుల సంఖ్య రెట్టింపయ్యింది.
అంతేకాదు, స్థానిక సివిల్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసరు స్వయంగా
బైదులు దగ్గరకు వచ్చి, తమ దగ్గర దీర్ఘకాలంగా నయంకాని రోగాలతో

బాధపడుతున్నవారికి తగిన వైద్యం చేయాలని కోరాడు.
ఐతే, ఇందుకోసం బాబావారి అనుమతి తీసుకోవాల్సిందని చెప్పాడు.
"చీఫ్ మెడికల్ ఆఫీసర్ తనకు తానుగా వచ్చి బైదుల్ సహాయం కోరుతున్నాడు కాబట్టి, ఆయనతో కలిసి ఆసుపత్రిలో చికిత్స చేయడానికి బైదుల్‌ని అనుమతిస్తున్నా నన్నారు బాబా.
ఈ సంఘటన పుండు మీద కారం చల్లినట్లైంది నీలూ –డాంకిన్‌లకు.
ఇది బాబావారి ఆదేశం కదా!!
వాళ్లు నోరు మెదపలేదు.
గవర్నమెంటు ఆసుపత్రిలో నయంకాని రోగులందరికీ,
అవతారుని నామస్మరణతో తన మందులిచ్చాడు బైదుల్. అనతికాలంలోనే దీర్ఘకాల రోగులందరూ ఆసుపత్రిని విడిచిపెట్టారని, మండలి సభ్యుడైన ఏరుచ్ బైదుల్ గురించి ఒక సందర్భంలో అన్నారు. 1922వ సంవత్సరంలో అవతారుని ఆశ్రమానికి వచ్చిన బైదుల్, అవతారుని సన్నిధిలో, బాబా ఇచ్ఛకు కట్టుబడి, కడదాకా అంకితమై జీవించిన ఆఘా బైదుల్ గురించి ఇలా చెప్పుమంటూ పోతే అదొక పెద్ద గ్రంధమే అవుతుంది.

**బైదుల్ తనకు చాలా ప్రత్యేకం అన్నారు బాబా.**

శ్రీ బైదుల్ 1970 జనవరి 23న అవతారుని నామస్మరణతో
బాబాలో ఐక్యమయ్యాడు. దిగువ మెహెరాబాద్‌లో ఈయన సమాధి వుంది.

***

# భాస్కరరావు బాబాలో ఐక్యం



గౌరు భాస్కరరావు (80) ఆగస్టు 26న రాత్రి 7.30 నిముషాల సమయంలో అవతారుని నామస్మరణతో బాబాలో ఐక్యమయ్యారని ఆయన సోదరుడు శ్రీ మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు.
శ్రీ భాస్కరరావు ఆర్ & బి శాఖలో సూపరింటెండెంట్ ఇంజనీరుగా పనిచేసి రిటైరయ్యారని, ఆయన బాబా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారని శ్రీ మోహన్‌రావు తెలిపారు.

# బెల్గాంలో నవజీవన స్మృతి కేంద్రం




1949 అక్టోబరు 16 నుండి 1952 వరకూ బాబా నవజీవన కార్యక్రమం
నిర్వహించిన సంగతి పాఠకులకు తెలుసు.
నవజీవనంలో బెల్గాంకు అత్యంత ప్రాధాన్యత వుంది.
బాబా తన నవజీవన బృందంతో కలిసి బెల్గాంకు
1949 అక్టోబరు 20 సాయంత్రం 4.30 సమయంలో వచ్చారు.
కర్నాటక రాష్ట్రంలోని జిల్లా కేంద్రమైన బెల్గాం పట్టణ పొలిమేరల్లో వున్న
థకల్‌వాడిలో నవజీవన బృందం 23 రోజులు బస చేశారు.
నవజీవన శిక్షణా కార్యక్రమాన్ని బాబా బెల్గాంలోనే ప్రారంభించారు.
ఆ రోజుల్లో స్థానిక బాబా ప్రేమికుడు విశ్వనాథ్ హల్‌దాన్‌కర్
థకల్‌వాడిలో బాబా పేరిట 22 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చాడు.
శ్రీ విశ్వనాథ్ హల్‌దాన్‌కర్ మరోవరో కాదు.
మండలి సభ్యుడైన విష్ణు మాస్టర్ అక్కగారి భర్త. అంటే బావ గారు.
ఐతే నవజీవనం నియమాలను అనుసరించి అవతారుని పేరిట
ఎలాంటి ఆస్తులు వుండరాదన్నది నియమం కదా!
మెహెరాబాద్, మెహెరాజాద్‌లలోని ఆస్తుల మాదిరిగానే,
థకల్‌వాడిలో విరాళంగా ఇచ్చిన 22 ఎకరాల భూమిని
దాని యజమాని విశ్వనాథ్ హల్‌దాన్‌కర్‌కు వాపసు ఇచ్చివేయమని

బాబా ఆదేశించారు. ఈ భూమి అవతారుని పేరిట రిజిష్టరయి వుంది.
కాబట్టి దాని యజమాని వద్ద నామమాత్రపు నగదు తీసుకుని
భూమిని యావత్తు తిరిగి ఇచ్చివేయమని బాబా ఆదేశించారు.
దీంతో మన దేశంలో ఎక్కడా తన పేరిట ఎలాంటి ఆస్తులు లేవని బాబా ప్రకటించారు.
ఐతే విష్ణు మాస్టర్ ఒక మంచి ఆలోచన చేశాడు.
నామ మాత్రపు నగదు తీసుకుని తన బావ గారికి బెల్గాంలో భూమిని బదలాయిస్తూనే,
బాబా మండలివారు బస చేసిన ప్రాంగణాన్ని నవజీవన స్మృతి చిహ్నంగా ఏర్పాటుకై
సుమారు 4 ఎకరాలను మాత్రం మెహెరామాయి పేరిట రిజిష్టర్ చేయిద్దామని
సలహా ఇచ్చాడు. ఇందుకు బాబా కూడా అంగీకరించారు.
ప్రస్తుతం మెహెరామాయి కూడా నవజీవనంలో పాల్గొంటోంది కాబట్టి
ఈ స్థలం బాగోగుల్ని విష్ణు మాస్టర్ సోదరి శ్రీమతి సుశీల దియోరూకర్,
ఆమె భర్త శ్రీ విశ్వనాధ్ హల్‌దాన్‌కర్‌లకు అప్పగించారు బాబా.
భవిష్యత్తులో ఈ నాలుగు ఎకరాల భూమి వినియోగం కూడా హరిద్వార్‌లో వున్న
మంజ్రే మాఫీ మాదిరిగానే వుంటుందని బాబా స్పష్టం చేశారు.

## మంజ్రే మాఫీ విశేషం ఏమంటే,

డెహ్రాడూన్ – హరిద్వార్‌ల నడుమ డెహ్రాడూన్ నుండి సుమారు 20 కిమీ దూరంలో
మంజ్రే మాఫీ వుంది. ఇక్కడ రెండు గదులు, చిన్న కిచెన్, వసారా వున్న
చిన్న ఇంటిని మండలి సభ్యులైన ఏరుచ్, కాకాబారియా, కేకి దేశాయి పేరిట
సంయుక్తంగా రిజిష్టరు చేయించారు. దీని గురించి బాబా తన వీలూనామాలో
స్పష్టంగా ఇలా తెలియజేశారు. ఈ ముగ్గురులో ఏ ఒక్కరు మరణించినా
మిగిలిన ఇద్దరు ఆ ప్రాంగణ బాగోగులు చూసుకుంటారని ముగ్గురి పేరిట
ఆ ఆస్తిని రిజిష్టరు చేయించమన్నారు. ఒక వేళ ఆ ముగ్గురులో ఇద్దరు మరణిస్తే
మూడవవానిపై ఆ బాధ్యత వుంటుందన్నారు. ఒకవేళ ముగ్గురూ మరణిస్తే,
నవజీవన యాత్ర నిర్వాహకులైన (ఎరేంజ్‌మెంట్ వాలాలు) నలుగురు సభ్యులకు
చెందుతుందన్నారు. విషయం చాలా స్పష్టంగా చెబుతూ, ఆ ఆస్తి ముగ్గురిలో
ఎవరికీ చెందదని, వారి మరణానంతరం వారి వారసులెవరికి ఆ ఆస్తి చెందదని
బాబా స్పష్టం చేశారు. ఇది తన మండలివారందరికి చెందుతుందని బాబా స్పష్టం
చేశారు. బాబాతో వున్న మండలివారందరూ కూడా ఈ ప్రపంచం నుండి శాశ్వతంగా
తనువు చాలిస్తేనో అని డాక్టర్ ఘనీ నవ్వుతూ అనగానే, **అఘాతా క్రిష్టీ నవల – "అండ్ దెన్, దేర్ వర్ నన్" అని చమత్కరిస్తూ, అందరూ చనిపోయాక ఇక ఆలోచించేదేముంటుందని బాబా అన్నారు.**

## బెల్గాంలోనూ అంతే...

అలాగే బెల్గాంలోని మెహెరా పేరిట రిజిష్టర్ చేయించిన ఈ నాలుగు ఎకరాల భూమి కూడా ఆమె పేరిట వున్నా ఆమె మరణానంతరం ఆమె తాలూకు బంధువులెవరికి చెందదన్నారు. ఈ స్థలానికి సంబంధించి కూడా ఒక వీలూనామా సిద్ధం చేయించారు. అందులో మెహెరామాయి తదనంతరం ఈ స్థలం నవజీవన కార్యక్రమ నిర్వాహకులైన (ఎరేంజ్‌మెంట్ వాలాలు) సరోష్, రంజూ, మెహెర్‌జీ, నారిమన్‌లకు సంయుక్తంగా చెందుతుందని వీలూనామా సిద్ధం చేశారు.

బెల్గాంలో నవజీవన కార్యక్రమ ప్రారంభోత్సవ కేంద్రంగా భావితరాలు స్మరించుకునేలా ఒక స్మారక స్మృతి కేంద్రాన్ని నిర్మించే బాధ్యత బాబా వారికి అప్పగించారు.

ఐతే, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ స్థలాన్ని అమ్మరాదని బాబా స్పష్టం చేశారు.

అంతటితో ఈ అంకం పూర్తయింది.

**ఇదంతా 1949 అక్టోబరు నాటి సంగతి.** అంటే సుమారు ఏడు దశాబ్దాలు గడిచాయి. ఆనాడు డాక్టర్ ఘనీ నవ్వుతూ అన్నా, ఆయన మాటలు నేడు నిజమయ్యాయని చెప్పొచ్చు. లేదా సర్వజ్ఞుడైన అవతారుడే డాక్టర్ ఘనీకి ఆ ఆలోచన రప్పించి, బాబా స్పష్టమైన జవాబు ఇచ్చారనీ అనుకోవచ్చు. ఈనాడు నవజీవన సహచరులు, బాబా మండలివారు అందరూ అవతారునిలో ఐక్యమయ్యారు. ఈ 72 సంవత్సరాలలో కాలచక్ర భ్రమణంలో బెల్గాం పట్టణంలో వున్న నాలుగు ఎకరాల భూమి అత్యంత విలువైనదయ్యింది. భూమి రేట్లకు రెక్కలు వచ్చాయి. బెల్గాం నగర విస్తీర్ణం పెరిగింది. నవజీవన శిక్షణా ప్రాంగణం తాలూకు భూమి ఎక్కడుందో గుర్తుపట్టలేని పరిస్థితి. అవతారుడు బహు చమత్కారని బాబా ప్రేమికుల నమ్మకం. ఏమైతేనేమి,

ఎన్నో సంవత్సరాల అన్వేషణ తరువాత, బెల్గాంలో అవతారుడు నిర్వహించిన శిక్షణా ప్రాంగణం, మెహెరా పేరిట రిజిష్టర్ చేయించిన భూమిని డాక్టర్ నరేంద్ర ప్రసాద్, హైదరాబాద్ గుర్తుపట్టారు. అదృష్టవశాత్తూ ఆ ప్రాంగణంలో కొద్దిపాటి భూమిని మినహాయిస్తే, పెద్దగా అన్యాక్రాంతం కాలేదు. పెద్ద భవనాల నిర్మాణం కూడా ఏమీ చేపట్టలేదు. ఈ విషయమై డాక్టర్ నరేంద్ర ప్రసాద్ సుమారు రెండు దశాబ్దాలుగా బెల్గాం –హైదరాబాద్‌ల నడుమ ప్రయాణిస్తూ, బెల్గాంలో అవతారుడి పేరిట నవజీవన స్మృతి చిహ్న నిర్మాణానికి తగిన కృషి చేస్తున్నారు. ఈ మేరకు, ధకల్‌వాడిలో అవతారుని పేరిట విరాళంగా ఇచ్చిన భూమి, ఆ దరిమిలా దాన్ని అమ్మివేసిన దస్త్రాలు, తిరిగి నాలుగు ఎకరాలు మెహెరా పేరిట 1949 అక్టోబరు ప్రాంతంలో రిజిష్టర్ చేయించడం వంటి విషయంలో తగిన ఆధారాలను సేకరించి సంబంధిత యాజమాన్యాలను సంప్రదించారు. తనకు ఈ విషయంలో హైదరాబాద్ ప్రేమికులు చాలామంది

సహకరించారని అన్నారు. ప్రస్తుతాంశంలో "మెహెర్ నవజీవన స్మృతి కేంద్ర ఏర్పాటుకు సంబంధించిన తాజా సమాచారం డాక్టర్ నరేంద్ర ప్రసాద్‌ని కోరగా అయన చెప్పిన విషయాలు సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తాయి. ఇకపై నరేంద్ర ప్రసాద్ మాటల్లోనే దయచేసి పరిశీలించండి.

## డాక్టర్ నరేంద్ర ప్రసాద్

బాబా ఇచ్చిన స్ఫూర్తితో నేను దాదాపుగా 2000 సంవత్సరం నుండి బెల్గాంలోని ధకల్‌వాడిలో చాలామంది స్థానికులను కలిశాను. 1949లో భూమి రిజిస్ట్రేషన్‌కి సంబంధించిన దస్త్రాల ఆధారం కొంతమేర దొరికాయి.
నేడు ఈ భూమి అనేకమంది చేతులు మారింది. బహుళ అంతస్తుల భవనాలకు, అత్యంత ఖరీదైన అపార్టమెంట్లకు ఈ ప్రాంతం ఆలవాలమైంది.
నవజీవన సమయంలో మెహెరాబాద్‌లో వున్న బాబా సమాధి, బెల్గాంలోని భూమిని ఎన్నడూ అమ్మవద్దని బాబా ప్రత్యేకంగా ఆదేశించారు.
ధకల్‌వాడిలో బాబావారు నవజీవన శిక్షణా కార్యక్రమం నిర్వహించిన ప్రాంగణాన్ని 2010 సంవత్సరంలో గుర్తుపట్టాము. అదృష్టవశాత్తూ అప్పటికి ఈ భూమిపై ఎలాంటి అపార్టుమెంట్లు వంటి భవనాల నిర్మాణం జరగలేదు.
ఇక్కడవారందరికీ బాబావారి నవజీవన కార్యక్రమ నిర్వహణ, ఈ స్థల ప్రాముఖ్యత ఇత్యాది వివరాలన్నీ వివరించి మెహెర్ నవజీవ స్మృతి కేంద్రం నిర్మించాలని ప్రతిపాదించాం.
కొంత స్థలం కొనుగోలు చేయాలని అనుకున్నాం.
ఐతే ఏకారణంగానో అవేవి ఫలప్రదం కాలేదు.
ఈలోగా 2019, 2020 ఫిబ్రవరిలలో ఈ ప్రాంతంలో **"ఎండ్‌లెస్ జర్నీ ఆఫ్ లవ్"** ఆధ్వర్యంలో ప్రేమిక సహవాస్ నిర్వహించాం.
ఆనాటి సహవాస్‌లో పాల్గొన్న ప్రేమికులందరూ ఈ పవిత్ర ప్రాంగాణాన్ని సందర్శించారు. కాగా, ప్రస్తుతం ఈ భూమికి సంబంధించిన యాజమాన్యంతో సుదీర్ఘ చర్చలు, వివరణలు అనంతరం నేడు మెహెర్ ప్రేమికులు కోరుకుంటున్నట్లు ఒక పెద్ద మెమోరియల్ హాలును సుమారు వెయ్యి అడుగుల విస్తీర్ణంలో నిర్మించేందుకు స్థానిక యాజమాన్యం అంగీకరించారు.
ఈ నిర్మాణపు పనులకు శ్రీకారం చుట్టారు.
పనులు చురుకుగా సాగుతున్నాయి.
త్వరలో పూర్తయి, బాబా దయవల్ల,
బాబా ప్రేమికులకు అందజేయబడుతుందని నా గట్టి నమ్మకం.

డెహ్రాడూన్‌కి సమీపంలోని మంగ్రీ మాఫీ ఆస్తి కూడా ఇదేమాదిరిగా చేతులు మారినా, తిరిగి అక్కడి స్థలాన్ని కొనుగోలు చేసి మెహెర్ స్మృతి కేంద్ర ఏర్పాటులో కూడా డాక్టర్ నరేంద్ర ప్రసాద్ (94406 02754) విశేష కృషి, చొరవ ఎంతగానో వున్నాయి. ఈ అవకాశాన్ని తనకు అవతారుడు ఇచ్చారని వినమ్రంగా చెబుతున్న నరేంద్ర ప్రసాద్ బెల్గాంలో కూడా బాబా తన చేయూతనందించి, త్వరలో **మెహెర్ నవజీవన స్మృతి కేంద్ర** నిర్మాణం పూర్తికాగలదని ఆశిద్దాం.

***

# చల్లపల్లి కేంద్రం

**ఆగస్టు 1,** ఆదివారం ఉదయం 5.30 గంటల నుండి 7 వరకు ప్రతి నెల మొదటి ఆదివారం జరిగే ఏకనామ కార్యక్రమం శ్రీమతి & శ్రీ కోట నీరజా శ్రీనివాస్ గారి పిల్లలు చి. హేమంత్, సుస్మితల పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులచే నిర్వహించడమైనది.

**ఆగస్టు 29న** చల్లపల్లి కేంద్ర వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రేమిక సహవాస్ నిర్వహించుకోవడమైనది. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీ పివి రమణారావు అవతారుని ప్రేమ సందేశాలపై ప్రసంగించారు.

## దాలిపర్తి వారింట వివాహం

శ్రీ దాలిపర్తి ప్రసాద్ గారి అబ్బాయి చి. మెహెర్ సాయి వివాహం చిలసౌ సుజనతో చల్లపల్లి 2021 ఆగస్టు 25న ఘనంగా జరిగినది. స్థానిక బాబా ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరయినారని శ్రీ పివి రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు.

# పత్రికకు వాలంటీర్ల కోసం విజ్ఞప్తి

**ప్రతి జిల్లాలో మెహెర్‌బాబా పత్రికకు వాలంటీర్లుగా పనిచేసేందుకు ఆసక్తిగల వారి నుండి తమ అంగీకారాన్ని తెలియజేయవల్సిందిగా కోరుతున్నాము. ఆసక్తిగల వారు తమ వివరాలను పత్రిక చిరునామాకు గాని లేదా వాట్సప్ నంబరు 9959553218 తెలియజేయవల్సిందిగా కోరుతున్నాము.**

# ప్రేమ - భక్తి

**(లవ్ - డివోషన్)**

"ప్రేమ - భక్తి" - గురించి ఆధ్యాత్మిక చింతనాపరులు చాలా విరివిగా వాడుతుంటారు. ఈ రెండింటి మధ్య హస్తిమశకాంతర బేధం వుందని అవతారుడు పలు సందర్భాలలో చాలా చక్కగా వివరించారు. **"ది పాథ్ ఆఫ్ లౌవ్"** అనే గ్రంథంలో తనను భగవంతునిగా ఆరాధించేవారందరికీ తనపట్ల భక్తి కంటే మిన్నదైన ప్రేమతో, తన ఇచ్ఛ ప్రకారం మెలగాలని స్పష్టం చేశారు బాబా.

***

సతారాలో మెహెర్‌బాబా కారు ప్రమాదం జరిగింది. ఆ దరిమిలా చిరోప్రాక్టర్‌గా విశేష అనుభవం వున్న డాక్టర్ హారికెన్‌మోర్, న్యూయార్క్ అవతారునికి విశేష వైద్య సేవలు అందించాడు. ఐనప్పటికి బాబాకు బాధ తగ్గలేదు. బాబా బాధపడుతూనే వున్నారు. ఈ విషయంపైనే బాధపడుతున్న డాక్టర్ హారికెన్‌మోర్‌ని చూసిన బాబా, ఓరోజున, ఏమైందీవేళ? దిగులు ఎందుకు? అని సర్వజ్ఞుడైన బాబా డాక్టర్‌ని ప్రశ్నించారు. అందుకు డాక్టర్ హారి ఇలా జవాబిచ్చాడు. "ఆనాడు నామ్‌దేవ్ పిలిస్తే రాతి శిల్పంలో వున్న పాండురంగ విఠల్ వచ్చి ప్రసాదాన్ని స్వీకరించి, ఆతని కోరిక తీర్చాడు. ఆ ఉదంతాన్ని డాక్టర్ హారి ప్రస్తావిస్తూ, "నేనెంతో శ్రద్ధతో వైద్యం చేస్తున్నప్పటికీ, బాబాకు ఉపశమనం లభించలేదని బాధపడుతున్నానని జవాబిచ్చాడు. (నామ్‌దేవ్ గురించి క్లుప్తంగా పేజి 19లో చూడగలరు).

**ఈ సంగతి గత నెల 2021 ఆగస్టు సంచికలో చదువుకున్నాం.**

ఆ సందర్భంలోనే బాబా **ప్రేమ -భక్తికి నడుమ** ఎంతో బేధం వుందని స్పష్టంగా ఇలా చెప్పారు. **ముందుగా, "నీ ప్రేమకూ - నామ్‌దేవ్ భక్తికి" ఎలాంటి పోలిక లేదన్నారు.** ఈ అవతారకాలంలో నేను మీ ప్రియతముడిని. ప్రేమికుడు తన ప్రియతముడి ఇచ్ఛ ప్రకారం నడుచుకోవడానికి, ప్రియతముడి ఆనందాన్ని కోరుకుంటాడు. ప్రేమ త్యాగమయి. ప్రేమ -తను ఆరాధించే ప్రియతమ భగవంతుడి నుండి ఏ కోరికలు, అవసరాలు తీర్చమని ఆశించదు. తన ప్రియతముడికి తన సర్వస్వం అర్పించడానికి తహతహలాడతాడు. **ఐతే, భక్తి అందుకు వ్యతిరేకం.** భక్తుడు తన భగవంతుడిని తన కోరికలు తీర్చాలని ప్రాధేయపడతాడు. ఇదెలాగంటే, నీవు చెప్పిన నామ్‌దేవ్ పెట్టిన ప్రసాదం స్వీకరించాలని ఆతను భగవాన్ కృష్ణుడి ఎదుట మొరపెట్టుకున్నట్లు. కృష్ణావతారంలో ఆనాటి సాంప్రదాయాల ప్రకారం అది సబబే. కానీ, నేను ఈ అవతారంలో సశీరుడిగా మీ ప్రియతముడిగా

వున్నాను. మీరు నా ప్రేమికులు. ప్రేమతో నీవు నాకు చేస్తున్న వైద్య చికిత్స చాలా చక్కగా వుంది. ఐతే, సతారాలో జరిగిన ఈ కారు ప్రమాదం **"నా ఇచ్ఛ" ప్రకారం జరిగింది.** విశ్వమానవ శ్రేయస్సు కోసం నేను ఈ బాధను అనుభవించాలి. ఇది స్వయంగా నేనుగా ఆహ్వానించి స్వీకరించిన బాధ. మీరు చేసే వైద్య సేవల వల్ల నాకు ఉపశమనం కలగదు. వైద్యులు నా బాధను తొలగించలేరు. నేను నీకు వైద్యం చేసే అవకాశం ఇచ్చాను. నా ఇచ్ఛను అనుసరించడమే ప్రేమికుని లక్ష్యం కావాలని డాక్టర్ హారికెన్‌మోర్‌కు సున్నితంగా చెప్పారు. డాక్టర్ హారి బాధపడటంలో అర్థంలేదని స్పష్టం చేశారు. భగవంతుని ఎడల ప్రేమ – భక్తికి నడుమగల వ్యత్యాసంపై అవతారుడు మరో సందర్భంలో ప్రవచించిన సందేశాన్ని ఓసారి పరిశీలించండి. స్పందించగలరు!!

| ప్రేమ | భక్తి |
|---|---|
| ప్రేమ – తన ప్రియతముడి కోసం పరితపిస్తుంది. | భక్తి అలాకాదు...– భక్తి తన ప్రియతముడ్ని తన కోరికలతో దహించి వేస్తుంది. |
| ప్రేమ – తన ప్రియతముడి ఆనందాన్ని ఎల్లవేళలా ఆనందం కోరుకుంటుంది. | భక్తి – ఎల్లవేళలా తన ప్రియతముడి ఆశీర్వాదం ఆశిస్తుంది. |
| ప్రేమ – తన ప్రియతముడి యొక్క బరువు బాధ్యతలు స్వీకరించాలని ఎదురు చూస్తుంటుంది. | భక్తి – తన బరువు బాధ్యతలను తన ప్రియతమునికి అప్పగించాలని ఆశిస్తుంది. |
| ప్రేమ – త్యాగమయి. తన సర్వస్వం తన ప్రియతముడికి సమర్పించడానికి తహతహలాడుతుంది. | భక్తి – తన ప్రియతముడి ముందు తన కోర్కెల చిట్టా వుంచుతుంది. |
| ప్రేమ – మౌనంగా, ఎలాంటి ప్రచార ఆర్భాటాలు లేకుండా, నిశ్శబ్దంగా తన ప్రియతముడిని ప్రేమిస్తుంది. | భక్తి – తన భక్తిప్రపత్తులను ఆర్భాటంగా బహిరంగంగా ప్రదర్శిస్తుంది. |
| ప్రేమ – తన ప్రియతముడు తన కళ్ళెదుట లేకపోయినా, ఎంత సుదూరతీరాల్లో వున్నా, తన ప్రియతముని ఆలోచనలతో ఆయన్నే స్మరిస్తూ ఆరాధిస్తుంది. | భక్తి తన ప్రియతముడి ఉనికిని కోరుకుంటుంది. |

# నామ్‌దేవ్ (క్రీ.శ.1270 - 1350)



మహారాష్ట్రకు చెందిన వాగ్గేయకారుడు సంత్ నామదేవ్ కేవలం మూడు సంవత్సరాల వయస్సులో ఒకరోజున తన తండ్రికి తీరిక లేకపోవడంతో భోజన ప్రసాదాన్ని విఠల్ ఎదుటవుంచి, తన భక్తి గానంతో విఠల్‌ని మెప్పించి నామదేవ్ పెట్టిన ఆహారాన్ని స్వీకరించేలా చేసిన ధన్యుడు.నామ్‌దేవ్ వర్కారీ సాంప్రదాయంలో ప్రముఖుడు. ఈ సాంప్రదాయం ప్రకారం దక్షిణ మహారాష్ట్రలో సంవత్సరానికి రెండుసార్లు భక్తులు సామూహికంగా పండరీపురానికి పాదయాత్ర చేస్తారు. వీరు విఠలుడ్ని ఆరాధిస్తారు. **"వార్కరీ అంటే** యాత్రికుడు" అని అర్థం. ఈ సాంప్రదాయం మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక ప్రాంతాలలో బాగా కనిపిస్తుంది. భక్తి గానంతో ముక్తిని పొందిన గొప్ప భక్తాగ్రేణ్యుడు **నామ్‌దేవ్.**

## మీకు తెలుసా?



ఈ ప్రక్కన వున్న చిత్రంకు సంబంధించి ఒక అందమైన వాస్తవిక కథనం దాగి వుంది. ఒక ప్రేమికునికి - తన ప్రియతముడికి నడుమ జరిగిన మానసిక సంఘర్షణ అది. దక్షిణాదికే చెందిన ఆ ప్రేమికురాలు తన మానసిక వ్యధను కడు రమ్యంగా, ఉన్నదిఉన్నట్లుగా చెప్పారు. అదేదో మీలో చాలామందికి తెలిసే వుంటుంది.

మీకు తెలిసిన కథనాన్ని రాసి వీలున్నంత త్వరలో అక్టోబరు 10లోగా పంపగల్గితే, ఆ కథనాన్ని మీ పేరిట 2021 అక్టోబరు సంచికలో ప్రచురించి మెహెర్‌బాబా పాఠకులతో ఆ ఆనందాన్ని పంచుకుందాం.లేనిపక్షంలో, హామ్ హై నా!! కోషిష్ కరేంగే!! మేమే ప్రయత్నిస్తాం. అందాక శెలవ్!!



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్,
వాల్యూం-3 (1925 నుండి...) - తెలుగుసేత:
శ్రీ మల్లాది రామారావ్, మెహెరాబాద్

1931 అక్టోబరు 6వ తేదీన బాబా వారు ఇస్తాంబుల్‌కి వచ్చారు.
టర్కీ దేశపు రాజధాని ఈ నగరం.
తమ ఆంతరంగిక కార్యక్రమం కోసం వో స్థానికుడు అవసరమన్నారు బాబా.
అతగాడు కుర్రాడు అయితే మంచిది అన్నారు.
ఇదేమీ కొత్త కోర్కె కాదు.
బాబా ఎక్కడకి వెళ్లినా వో మంచి కుర్రాడిని వెతికి పట్టుకురావడం
మండలి వారికి అలవాటయింది. ఆ అలవాటు ఇప్పటిదా, ఎప్పటిదో.
ఇంతకీ చెప్పేది ఏమిటి అంటే, బాబా వారికి నచ్చే కుర్రాడిని తేవడం
అంత ఆషామాషి పని కాదు. ఇది రుస్తుం ప్రభృతులకు బాగా తెలుసు.
వో మూడు రోజులు గాలించి గాలించి వో మంచి అబ్బాయిని తెచ్చారు.
వయస్సు పదహారు ఏళ్లు. చూడడానికి ఎర్రగా, బుర్రగా బాగున్నాడు.
వో నాలుగు అయిదు బాషలు వచ్చు అట. ఇంగ్లీషు మాట్లాడుతాడు.
ఫ్రెంచి, గ్రీకు వచ్చు. యూదుల మాతృభాష హిబ్రూ కూడా
అతని నోట పలుకుతుంది. ఇహ మాతృ భాష టర్కిష్ సరేసరి.
ఇలా అయిదు భాషలు ఎలా వచ్చాయో ఆ కుర్రాడికి ?
తండ్రి ఎగుమతి - దిగుమతి వ్యాపారస్థుడు.
బహుశా అతగాడి వ్యాపార లావాదేవీల పేరు చెప్పి నాలుగు భాషల వాళ్లు
ఇంటికి రావడం, వాళ్ల మాటామంతీ ఇతగాడి చెవిని పడటం,
వొంట బట్టడం జరిగి వుండాలి. ఇది వూహాగానమే సుమా.
ఈ విషయమై చరిత్రకారుడు ఏమి చెప్పలేదు. ఏది ఏమయితేనేం,
ఈ కుర్రాడు బాబా వారికి నచ్చాడు. అతడికీ బాబా వారంటే గురి కుదిరింది.
బాబా వారి మండలితో కలిసి పోయాడు ఆవాల్టి నుంచి.
ఇంతకీ ఏవాల్టీ నుంచి అని కదూ మీ ప్రశ్న పాఠక మహాశయా!
ఎప్పటి నుంచి అంటే శుక్రవారం ఎనిమిదవ తేదీ నుంచి.
వీడూ మనతోనే భోజనం చేస్తాడీ రాత్రి అన్నారు బాబా.

సరే ఏర్పాట్లు చేస్తానన్నాడు రుస్తుం.
బాబా వారి సంగతి తెలుసుగా. ప్రభువు ఫక్తు శాఖాహారి.
మరి ఈ కుర్రాడు శాఖాహారి కాదే.
టర్కీ ప్రజలు అందరిలానే ఇతనూ మాంసాహారి.
మరి ఆకుకూరల భోజనం నచ్చుతుందా ?
మరి వాడి కడుపు నిండేది ఎలాగ? ప్రభువుకు తెలియని సంగతులు కావు.
మనకి శాఖాహారం చెప్పినా, కుర్రాడికి మాత్రం మాంసం కూర తెప్పించండి
అన్నారు. తలాడించాడు రుస్తుం. హొటలు కుర్రాడికి కొత్త ఆర్డరు
ఇస్తుంటే అతను 'వద్దు సార్' అన్నాడు. "నాకు మాంసం కూర వద్దండి.
ప్రభువు మాంసం ముట్టుకోవడం లేదు కదా, నాకెందుకండి,
మీ అందరిలాగే నాకూ శాఖాహారమే ఈ వేళ" అన్నాడు.
వెంటనే రుస్తుం అతని భుజం తట్టాడు. శహభాష్ చెప్పాడు.
గురు విధేయత అంటే ఇలా ఉండాలి అన్నాడు.
వీరిద్దరినీ చూస్తున్న ప్రభువు ప్రసన్నవదనులయ్యారు.
ఆ వేళ మాటల సందర్భంలో గాంధీ గారి ప్రస్తావన వచ్చింది.
మహాత్ముడు ప్రభువుని ఎందుకు కలిశాడో అన్న ధర్మ సందేహానికి
సమాధానం దొరికింది. పూరకనే రారు మహాత్ములు అన్నట్లు
మహాత్ముని వంటి వ్యక్తులు ఎవరినీ ఊరకనే కలవరు కదా!
రాజకీయాల్లో తల మునకలవుతున్న గాంధీ కూడా వో సాధకుడు.
ఆధ్యాత్మికంగా ముందంజ వేయాలనే తపన పడుతున్నాడు.
అందుకనే మెహెరుని కేసి మొగ్గు చూపాడు.
ఈ మాటే బాబా వారన్నారు.
గాంధీని రప్పించింది తమ దివ్యశక్తి అన్నారు.
సద్గురువు తన దివ్యాధికారంతో మేలు చేస్తాడనుకున్నాడు.
అందుకనే దివ్యానందపు తాళం చెవిని ప్రసాదించమని అర్థించాడన్నారు.
'అమ్మో! గడుసువాడే గాంధీ!" అనిపించింది రుస్తుంకి.
రెండు రోజుల తర్వాత అంటే ఆదివారం 10వ తేదీన,
బాబా వారు మెచ్చిన మన టర్కీ కుర్రాడు తన స్నేహితుడిని తీసుకొని వచ్చాడు.
అతని పేరు హెూల్ఫేన్. అతడూ నచ్చాడు బాబా వారికి.
ఇస్తాంబుల్ నగరంలో చూడదగ్గ ప్రదేశాలు చాలానే ఉన్నాయి.
వాటిల్లో చెప్పుకో దగ్గది వో మసీదు. 269 అడుగుల పొడవు, 240 అడుగుల
వెడల్పు, 180 అడుగుల ఎత్తు ఉన్న ఈ రాతి కట్టడం పేరు హాజియా సోఫియా.

1661 సంవత్సరాల క్రిందట అంటే క్రీస్తు పుట్టిన 360 ఏళ్లకి ఈ భవన నిర్మాణం ప్రారంభమయింది. సుమారు 170 సంవత్సరాలు పట్టింది పూర్తి చేయడానికి. అప్పట్లో ఇది క్రైస్తవ ప్రార్థనా మందిరం చర్చి. జ్ఞాన దేవత పేరున కట్టారు గ్రీకులు. తూర్పున రోమన్ సామ్రాజ్యంలో ఇదే అతిపెద్ద చర్చి.

15-16 శతాబ్దాలల్లో అట్టోమన్ సామ్రాజ్యం ఏర్పడ్డాక,

అంటే 14వ సంవత్సరంలో ఈ చర్చి పుణ్య హాజియా సోఫియా మసీదుగా మారింది. బాబా వారు ఈ మసీదుని సందర్శించిన నాలుగేళ్లకి అంటే,

1935లో ఈ మసీదుని మ్యూజియంగా మార్చారు.

దానికి కారణం మతాతీత లౌకిక రాజకీయ వ్యవస్థ నెలకొనడం.

నవ నాగరిక టర్కీకి పునాది వేసిన అటాటర్క్ శ్రీకారం చుట్టాడీ వ్యవస్థకి.

ఏడాది క్రిందట అంటే 2020లో కొత్త రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి.

హాజియా సోఫియా మళ్లీ మసీదు అయ్యింది.

ఇదీ స్థల పురాణం.

మనం మెహెరీశం లోనికి మళ్లీ వస్తే,

అక్టోబరు 10న బాబా వారు ఈ మసీదు సందర్శించారు.

రుస్తుం, ఆలీ, ఛాన్జీలతో పాటు టర్కీ కుర్రాడు, అతగాడి మిత్రుడు హెూల్ఫోన్ వెంట కదిలారు. ఈ మసీదుకి చాలాసార్లు వెళ్లాడట హెూల్ఫోన్.

అక్కడి విశేషాలు, ప్రత్యేకతలు బాగా తెలుసు.

బాబా వారికి మసీదు చూపిస్తుంటే ఇతగాడు కూడా 'గైడ్' అనుకున్నారు.

తీర్థ క్షేత్రాల్లో, ప్రాచీన క్షేత్రాల్లో స్థానిక వింతలు, విడ్డూరాలను తెలియజెప్పేవాళ్లని 'గైడ్' అంటారు. అంతా చూపించాక తృణమో, పణమో ముట్టుతుంది.

అదే వారి రాబడి. మరి మన హెూల్ఫోన్ 'గైడ్' లాగా మారగానే మా పొట్టకొట్టాడని కోపం వచ్చింది స్థానిక గైడ్‌కి.

అంతే, హెూల్ఫోన్ పైకి కుప్పించి లఘించాడు. తిట్ల వర్షం కురిపించాడు. పోలీసులను పిలిచాడు. పూర్వాపరాలు విచారించకుండా, పోలీసులు హెూల్ఫోన్‌ని అరెస్టు చేసి స్టేషనుకు తరలించారు.

పాపం ఆ కుర్రాడు భయంతో వణికిపోయాడు.

వాడికి ధైర్యం చెప్పారు బాబా వారు.

రుస్తుం గారు పోలీసులు వెంట స్టేషనుకు వెళ్లి అక్కడి పెద్దలని కలిసారు.

హెూల్ఫోన్ గైడు కాదండి. ఏదో తనకి తెలిసిన నాలుగు సంగతుల్ని మాకు చెప్తున్నాడు. అదీ మాతో వచ్చాడు కాబట్టి.

అంతే.

మసీదు గైడు అనుకున్నట్లు ఇతనేమీ ఎవరి పొట్టకొట్టడం లేదు, సరికదా
నాలుగు రాళ్లు జేబులో వేసుకోవడం లేదని వివరించారు.
ఏ కళనున్నాడో పోలీసు పెద్ద, రుస్తుం మాటలు విన్నాడు. కుర్రాడిని వదిలేశాడు.
మరి వెనక్కి వెడదామా? మసీదు పూర్తిగా చూద్దామా? ఇవి రుస్తుం ప్రశ్నలు.
బాబా వారికి మసీదుకు తిరిగి వెళ్లాలనిపించలేదు.
ఆ పక్కనే ఉన్న మ్యూజియం చూద్దామన్నారు.
తీరా అక్కడకి వెడితే, అది మూసేసి ఉంది.
ఇప్పుడేం చేద్దాం? అలా వూరు తిరిగి వద్దాం అన్నారు బాబా.
టాక్సీ నగర వీధుల్లో తిరుగుతుంటే, డ్రైవరు అన్నాడు కదా!
సార్ మీరు చూస్తానంటే చెప్పండి చోరా మఠానికి తీసుకొని వెడతాను,
అది ఒకప్పుడు గొప్ప చర్చి. ఇప్పుడు శిథిలావస్థలో ఉంది అన్నాడు.
మెహెరీశుడు సరేనన్నారు. హాజియా సోఫియా మాదిరిగానే,
ఈ చర్చిని కూడా మసీదుగా మార్చారు.
వూరికి కొంచెం దూరంలో ఉంది. టాక్సీ డ్రైవరు చెప్పినట్లు శిథిలావస్థలో ఉంది.
ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ వో పెద్ద తైల చిత్రం.
ఏసు ప్రభువు, ఆయన 12 మంది ప్రధాన శిష్యులు దర్శనమిస్తారీ చిత్రంలో.
"మన ఎదురుగా వున్నారా" అన్నంత చక్కగా చిత్రించాడో చిత్రకారుడు.
అతను ఎవరో, పేరు ఏమిటో, ఎక్కడి వాడో, ఎప్పుడు చిత్రించాడో ఎవరికీ తెలియదు.
చరిత్ర పుటల్లో అజ్ఞాతంగా నిలిచిపోయిన ఆ మహా కళాకారుడికి జోహార్లు చెప్పడం
మనందరి విధి. కర్తవ్యం కూడా. ఇంతకీ చెప్పేది ఏమిటి అంటే,
మందిరం శిథిలావస్థలో ఉన్నా, ఈ చిత్రం చెక్కు చెదరకుండా
సందర్శకులకి గతాన్ని గుర్తు చేస్తోంది.
ఇక్కడిదే మరో చిత్రం బాల ఏసుని ఎత్తుకొన్న మేరీ మాత
ఎంత అందంగా వుందో చెప్పలేము మాటల్లో. ఈ అజ్ఞాత చిత్రకారునికి మన
జోహార్లు. చోరా మఠం నుంచి మురికివాడలకి బాబా వారు వెళ్లారు.
మురికివాడలు ఏ నగరంలో ఉండవు కనుక.
కూలి చేసుకొని పొట్ట నింపుకొనే పేదవారి నిలయాలు ఈ మురికివాడలు.
ఆసియా, ఐరోపా దేశాలకి మధ్య వారధి వంటి టర్కీ దేశపు రాజధానిలో కూడా
పుష్కలంగా ఉన్నాయి మురికివాడలు. మేల్కొల్పుటకే వచ్చిన మెహెరీశుడు,
పేదరికం విలయతాండవం చేస్తున్న ఆ మురికివాడ వీధుల్లో చాలాసేపు తిరిగారు.
దీనజనోద్ధరణకి కొత్త బీజం వేశారు. ఇది ఎలా తెలుసు మీకు అంటారా.
బాబా వారు ఏ పనీ వూరకనే చేయరని మీకు తెలుసుగా.

మూఢాచారాలని పునాదులతో సహా పెకిలించడానికి మెహెరాబాద్‌లో
బాబా వారు వేసిన బీజం పాఠకులకు తెలుసు.
విడిగా కుంపటి పెట్టుకుంటున్న బ్రాహ్మణులని,
అంటరానితనం పేరుతో విడివిడిగా ఉంటున్న హరిజనులని,
మతం పేరిట దూరదూరంగా ఉంటున్న హిందువులని, ముస్లిములనీ, పార్శీలని
అందర్నీ వొకే త్రాటిపైకి తేవడం అసాధ్యమనుకొనే రోజుల్లో
మెహెరీశుని మంత్రం మండలివారిని మార్చింది.
భారతీయ సమాజ సముద్ధరణకి నాంది పలికింది.
ఇప్పుడు ఇక్కడ ఇస్తాంబుల్ మురికివాడల ప్రజానీకం మధ్య తిరిగి,
తమ పాదధూళితో ఆ జాగాని పునీతం చేశారు.
పేద ప్రజల జీవితాల్లో వెలుతురు నింపారు.
ఇదంతా మెహెర్ ప్రభువు ఆంతరంగిక కార్యక్రమం.
కనులు వుండి చూడలేనివారు, చెవులు వుండి వినలేని వారు ఉన్న ఈనాటి
ప్రపంచంలోని వునికి గుర్తించబడినా లేకున్నా, నవశకానికి నగారా మ్రోగింది.
బాబా వారే శెలవిచ్చారీ సంగతిని.
ఆదివారం 11వ తేదీన రుస్తుం ఖాన్జీలతో మాటల మధ్య చెప్పారు.
ఇక్కడ తామెవ్వరినీ కలువ లేదని, అయినప్పటికీ అంతరంగిక విశ్వకార్యక్రమాన్ని
విస్తారంగా చేశామని చెప్పారు. అసలు టర్కీ వచ్చినదే అతి ముఖ్యమైన
విశ్వకార్యక్రమం కోసమన్నారు. సైనికశక్తి పరంగా, సంపదల పరంగా
టర్కీ ముందుంజ వేసిందనుకోండి.
కానీ గతంతో పోలిస్తే టర్కీ ఎందులోనూ ముందంజలో లేదు,
సరికదా బాగా దిగజారింది.
ఆధ్యాత్మికంగా అయితే ఎందుకూ కొరగాకుండా పోయింది అని పేర్కొన్నారు.
ఇప్పుడు ఈ దేశంలో ఎవరు చెలామణి అవుతున్నారో తెలుసా అని ప్రశ్నించారు.
నిజాయితీ లేని నాయకులు ఎక్కువయ్యారన్నారు.
అయోగ్యులకి పట్టం కడుతున్నారు ఇక్కడ అన్నారు.
వీళ్లే – నిజాయితీ రహితులు, అయోగ్యులు ఎక్కువయ్యారు టర్కీలో అన్నారు.
చెడు శక్తులని ఢీకొట్టి ఆపాలి. మరి అందుకు ఆధ్యాత్మిక శక్తి బలం పుంజుకోవాలి.
ఈ మహోత్తర కార్యక్రమం కోసం స్వయంగా వచ్చామన్నారు.
మర్నాడు, అక్టోబరు 12వ తేదీన ఖాన్‌జీ 'థామస్ కుక్' ఆఫీసుకు వెళ్లాడు.
దేశ విదేశాలకి వెళ్లడానికి రైలు, విమానం, ఓడ టిక్కెట్లుని విక్రయిస్తుందీ కంపెనీ.
ప్రపంచవ్యాప్తంగా ఈ కంపెనీ శాఖలున్నాయి.

మన దేశంలో కూడా థామస్ కుక్ ఆఫీసులున్నాయి.
రూపాయలకి, డాలర్లు ఇవ్వడం వంటి విదేశీ మారకద్రవ్య
వ్యాపారం కూడా చేస్తుందీ కంపెనీ.
ఛాన్‌జీకి కావాలి అమెరికా టిక్కెట్టు. అది బాబా వారి కోసం.
రుస్తుం ఇండియా వెడుతున్నాడు. అందుకు టర్కీ నుండి అలెగ్జాండ్రియా వెళ్లాలి.
అదీ రేపే. ఈజిప్టు నగరం నుంచి ఇండియా వెళ్లే వోడ పట్టుకొంటాడు.
ప్రభువు అతనకి వో కొత్తపని అప్పగించారు. వివరాలు గోప్యంగా ఉంచారు.
బాబా వారు తిరిగి లండన్ వెళ్లి, అక్కడ నుంచి అట్లాంటిక్ మహాసముద్రం దాటి
అమెరికా చేరవచ్చు. కానీ ఎందుకనో ప్రభువుకి లండన్ వెళ్లాలని లేదు.
ఇంకొక రూటులో అమెరికా వెళ్ల వచ్చేమో కనుక్కో అన్నారు.
ఇక్కడ నుంచి పరిష్యా వెళ్లండి. అక్కడ నుంచి ఇటలీ వెళ్లండి.
ఇలా అంచెలంచెలుగా అమెరికా వెళ్లవచ్చున్నారు.
అంటే పరిష్యా, ఇటలీ వీసాలు కావాలి.
ఆ రెండు దేశాల రాయబార కార్యాలయాలకి వెళ్లి, దరఖాస్తు పెడితే,
వస్తాయి ఈ వీసాలు. ఈ పని 13వ తేదీన చేశారు.
బాబా వారు వున్న హొటల్ మేనేజరు బంట్రు సాయంతో ప్రయాణపు ఏర్పాట్లు
చకచక జరిగినాయి. 13వ తేదీన ప్రపంచ యుద్ధం గురించి కొన్ని సంకేతాలను
ఇచ్చారు బాబా వారు. వచ్చేది ప్రపంచ యుద్ధం. చాలా తక్కువ రోజులే సాగుతుందీ
పోరు. కానీ చాలా విధ్వంసం సృష్టిస్తుంది. కొంత తుడిచి పెట్టుకుపోతుంది.
ఈ గతి చక్రాన్ని నిర్ణయించాను, అని అంటూ బాబా వారు వొక మాట శెలవిచ్చారు.
రానున్న ప్రపంచ యుద్ధంతో అందరి బ్రతుకులు నరక ప్రాయమవుతాయన్నారు.
ఇంగ్లాండ్ కూడా తప్పించుకోలేదు అన్నారు. యుద్ధంలో ఆఖరి పావును కదిపేది
అమెరికానే అన్నారు. మరి ఇండియాలో? అక్కడ కూడా అంతర్యుద్ధం వస్తుందన్నారు.
14వ తేదీన బాబా వారు టర్కీ నుంచి ఇటలీ బయలుదేరారు.
సాయంత్రం 5 గంటల 35 నిమిషాలకు రైలు ఎక్కారు ఇస్తాంబుల్లో.
రెండు రోజుల తర్వాత 16వ తేదీ గోధూళి వేళ మిలాన్ నగరంలో అడుగుపెట్టారు.
ఫ్యాషన్లకి రాజధాని ఈ ఇటలీ నగరం. ఎనిండ్ రావాలి స్టేషనుకి,
ఎంత వెతికినా కనబడలేదు. ఆమె ఇంటి ఎడ్రస్ తెలుసు కాబట్టి
ఎకాయెకి అక్కడికే వెళ్లారు అందరూ. బాబా వారిని చూస్తూనే నాలుక
కరుచుకుందామె. పొరపాటు అయ్యింది బాబా అన్నది. మీ కోసం హొటల్ బుక్
చేసాను. స్టేషనుకు వద్దామనుకొంటూనే వున్నా, గడియారం చూసుకోలేదు అంటూ
నీళ్లు నమిలింది. దయామయుడు ఆదేమి పట్టించుకోలేదు.

సరే పద హొటల్‌కి వెళదామా అన్నారు.
"ఆల్బెర్లో ఇంపీరియల్" ఆ హొటల్ పేరు.
పదవ అంతస్తులో వో రెండు గదులు బుక్ చేసింది
అదీ తొమ్మిది రోజులు వుండడానికి.
ఆ రాత్రి ఆతిధ్యం ఓ శాఖాహార హొటల్లో భోజనం.
భోజనంపై ఎవరూ ఏ వ్యాఖ్య చేయలేదు.
బహుశా రెండు రోజులు రైల్లో భోజనం చేశాక
ఈ హొటలు భోజనం తృప్తినిచ్చి వుండాలి అందరికీ.
సెర్తోసా మఠానికి మర్నాడు వెళ్లారు అందరూ.
మిలాన్ నుంచి గంట ప్రయాణం అక్కడికి.
ప్రభువుకి నచ్చిందా ప్రాంతం. ప్రశాంతంగా వుంది.
గుండు సూది క్రిందపడినా వినిపించేంత నిశ్శబ్దం.
జనసంచారం తక్కువ. దాంతో ఏకాంతంగా ఎంత సేవయినా కూర్చోవచ్చు అక్కడ.
ఆ మఠం అంతా తిరిగారు బాబా. అక్కడి ధ్యాన మందిరాలు బాగా నచ్చాయి.
వరండాలో అరగంట సేపు కూర్చొన్నారు. ఎంత సుందరంగా వుందీ జాగా
అనుకున్నాడు చాన్జీ. వరండా ఎదురుగా ఆరు బయలు ప్రాంతం,
చుట్టూరా చక్కని చెట్లు, ఆ చెట్ల నుంచి చల్లని గాలి,
మఠంలో ఆధ్యాత్మిక వాతావరణం బాగుందన్నారు బాబా వారు.
అందుకనే కామోసు కదలండి, బయలుదేరండి అనలేదు.
తొందరేముంది, వెడదాములే అన్నట్లున్నారు ప్రభువు.
ప్రొద్దుట బయలుదేరేటప్పుడు చిరాకుగా వున్నారు. చికాకుగా కనిపించారు.
ఇప్పుడు మూడ్ మారింది ప్రభువుకి అనుకున్నాడు చాన్జీ.
స్థల మహత్యం అనుకున్నాడు.
ఇంతలో బాబా వారు తమ విశ్వకార్యక్రమం గురించి ఎనిండికి చెప్తుంటే,
"ఔరా!" ఎంతటి శుభదినం ఈ వేళ అనిపించింది.
ఎనిండికి తోడుగా థియో కూడా వచ్చింది.
ఇద్దరూ మంచి మిత్రులు కావడంతో అవతారుని దర్శనానికి
నేనూ వస్తాననడం ఆమె సరే, రమ్మనడం జరిగింది. ఇద్దరి పంట పండింది.
అవతారుడు స్వయంగా తమ అంతరంగిక కార్యక్రమం గురించి వివరించారు.
"నేనెప్పుడూ పని చేస్తుంటాను. నా కోసం కాదు. ఈ యావత్ ప్రపంచం కోసం"
అన్నారు. నా పని సామాన్యులకి అంతుపట్టదన్నారు.
మానవ మేధస్సుకే అతీతమైనది తమ విశ్వకార్యక్రమన్నారు.

నేను నా కోసం పనిచేయాల్సిన అవసరమేముందని ఎదురు ప్రశ్న వేశారు.
అనేక రకాల మాధ్యమాల ద్వారా తమ పనిని చేస్తామన్నారు.
మరి నా పనికోసమనే నాటకాలు చూస్తాను. సినిమాలకు వెడతాను,
రకరకాల దృశ్యాలు చూస్తాను. ఇలా సందర్భాన్ని పట్టి
ఏ మాధ్యమాన్ని ఎన్నుకొంటాను. నా విశ్వ కార్యక్రమం చేస్తాను అన్నారు.
బహుశా సినిమా చూసి ఆనందిస్తానను కొంటున్నారేమో? అదేమి లేదు.
సినిమా అయినా, నాటకమయినా, మరేదయినా సరే నా పనికి అక్కరకు
వచ్చే సాధనాలు అవి. నాకు వినోదం తెచ్చి పెట్టవు అన్నారు.
ఆ మాధ్యమం ద్వారా నా పని జరుగుతుంది అంతేనన్నారు.
ప్రతిక్షణం పనిచేస్తుంటానన్నారు. ఉచ్ఛ్వాస నిశ్వాసల మాదిరిగా నిరంతరం
జరుగుతుంది తమ పని అని పేర్కొన్నారు.
ఖాళీగా కూర్చొన్నట్లు కనబడవచ్చు నేను.
అలా అనుకుంటే పప్పులో కాలేసినట్లే మీరు అన్నారు.
నా అంతరంగిక కార్యక్రమం మీకు అంతుబట్టదు.
ఆ రహస్యం గ్రహించలేరు మీరు అని స్పష్టం చేశారు.
మానవ కళ్యాణార్థం ఉత్కృష్టమైన పనిచేయాలి నేను. ఇదే నా అనంత విధి.
ప్రస్తుతం గడ్డుకాలం నడుస్తోంది. ఇందువల్ల కొన్ని జటిల సమస్యల వలన అనండి,
తమ బాధ్యత బాగా పెరిగిందన్నారు. కాలమాన పరిస్థితుల ప్రభావాన్ని బట్టి
తమ బాధ్యత మారుతూ వుంటుందన్నారు.. ఆధ్యాత్మిక సామ్రాజ్యానికి చక్రవర్తిని
నేనే' అని సాధికారంగా ప్రకటించారు. ప్రపంచం నలుమూలల నుంచి
నాకు స్థానిక స్థితిగతుల గురించి రిపోర్టులు వస్తుంటాయి.
అనుక్షణం వస్తాయి ఈ రిపోర్టులు. నా ప్రతినిధులు పంపుతారు.
ఇవన్నీ మీ కళ్లకి కనబడవు, చెవులకి వినబడవు. అంతర్గతంగా పంపుతారీ రిపోర్టులు
అన్నారు. ప్రస్తుతం గడ్డు కాలమన్నాను కదా
అందుకని నాకు వచ్చే రిపోర్టులు కలవర పెడుతున్నాయన్నారు.
చైనా జపాన్ల సంఘర్షణ వంటి వార్తలు కుప్పలు తెప్పలుగా పంపుతున్నారు
తమ ఏజెంట్లన్నారు. వాళ్లకి ప్రతిసందేశం పంపుతున్నాను అన్నారు.
అనుక్షణం జరుగుతుందీ ప్రక్రియ అన్నారు. ఏజెంట్లు నుంచి రిపోర్టులు వస్తాయి
వెంటనే తక్షణ కర్తవ్యం పంపుతామన్నారు. ఈ పని – మీ కళ్లకి కనబడదు.
మీకెవరికీ తెలియనే తెలియదు. ఎన్ని వందల వేల పనులు ఏక కాలంలో చేస్తానో
నేను అంటూ బాబా వారొక విషయం చెప్పారు.
ఏమా విషయం అంటే, బాబా వారి ఆంతరంగిక కార్యక్రమపు ప్రభావం.

తమ పని కళ్లకు కనబడకపోయినా, దాని ప్రభావం తెలుస్తుంది అందరికీ అన్నారు.
ఇది ఎలా అంటే ఒక్కోసారి ప్రభువు చిరాకుగా ఉండవచ్చు.
ఉల్లాసంగా కనపడవచ్చు. ఇంకోసారి అబ్బ! ఎందుకింత అసహనంగా
కనిపిస్తున్నారని ఆశ్చర్యపడవచ్చు చూసేవాళ్లు. కాసేపు గంభీరంగా, కొంచెం సేపు
కోపంగా వుండవొచ్చు. విషాద ఛాయలు కనబడవచ్చు మొహంపై. ఇవన్నీ తమకి
వచ్చే రిపోర్టుల పుణ్యమేనన్నారు. ఆ రిపోర్టులని బట్టి తమ పనిలో మార్పులు,
చేర్పులు చేస్తుంటామన్నారు. "ఓహో! అలానా ప్రభూ" అన్నది ఎనిండ్.
నీకు అర్థమయిందా అన్నట్టు ప్రభువు థియో కేసి చూశారు. ఆమె తలాడించింది.
అర్థమయినట్టా, అర్థం కానట్టా ? బహుశా ఇందుకనే బాబా వారు వో
ఉదాహరణ చెప్పారు. నేను మీ అందరితో కూర్చొని సరదాగా టీ తాగుతున్నాను
అనుకోండి. నాకు రిపోర్టు వస్తుంది., ఆ వైనం మీకు తెలియదు.
ఎందుకని అ టెలిగ్రామ్ పట్టుకొని రారు కదా ఎవ్వరూ. నా మనస్సుకు అందుతుంది.
అదే అంతర్గతంగా – ఏజెంట్ మనసు నుంచి – నా మనస్సుకు.
భారతదేశంలో ఏదో గడ్డు సమస్య ఎదురైందన్నది ఆ వార్త సారాంశం.
మరి నేను వెంటనే జవాబు ఇవ్వాలి. ఏదో సత్వర పరిష్కార మార్గం సూచించాలి.
మరి నేనా పనిచేస్తుంటే, నా ముఖ కవళికలు మారుతాయి.
"చుట్టుపక్కల ఏమి జరుగుతున్నదీ పట్టించుకోవడం లేదు.
ఇంకోలోకంలో ఉన్నారు బాబా," అనిపిస్తుంది మీకు.
మీ బుర్ర పరిపరి విధాల పోతుంది. అసలు సంగతి తెలియదు.
నా పని తెలియదు సరికదా తెలుసుకుందామన్న ఆసక్తి లేదు మీకు.
ఇది మీ అజ్ఞానం. కానీ నన్ను చూస్తుంటే, నా పరధ్యానం చూస్తుంటే,
మీ మనస్సు కొట్టుకుపోతుంది.
అయ్యో! బాబా ఇప్పటి వరకూ బాగానే ఉన్నారు కదా!
ఇంతలో ఏమయింది ఇలా అయిపోయారని కొట్టుకుపోతారు.
అవునా! అని బాబా వారు అడుగుతుంటే, ఎనిండేకే కాదు
ఛార్నీ, ఆలీలకు కూడా 'నిజమే కదూ!' అనిపించింది.
బాబా వారికి ఏమయింది అన్న అదుర్దా తప్ప, మన మట్టి బుర్రలకి ప్రభువు
మహిమ తెలుసా? ప్రభువు ఆధ్యాత్మిక కార్యక్రమం బుర్రకెక్కుతుందా
ఏమన్నానా అని ఖిన్నులయ్యారు వో క్షణం. సర్వం తెలుసుకోవాలన్న తపన వుంటే
సరిపోదు. అవగాహన శక్తి కావాలి. ఆ శక్తి ప్రభువు వరమిస్తేనే మన పరం
అవుతుందనుకొన్నారు. ఆ శుభ ఘడియ ఎప్పుడో.

**– సశేషం**

అవతారుని సందేశం

# భగవంతుడు మరియు ప్రేమ

**(డాక్టర్ జయసూర్య, హైదరాబాద్)**

1944 నవంబర్ 12. ఆదివారం, సాయంత్రం 7.30.
బాబా నాగపూర్‌లో పర్యటిస్తున్నారు. నాగపూర్‌లోని ధంతోలి అనే ప్రాంతంలో వున్న నేషనల్ కాలేజీకి బాబా తన మండలి సభ్యులతో కలిసి వెళ్ళారు. డాక్టర్ సిడి దేశ్‌ముఖ్ కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు. ఆనాడు స్థానిక కాలేజి ఆడిటోరియం విద్యార్థులతో, పురప్రముఖులతో కిక్కిరిసి వుంది. ఈ సందర్భంగా యువతని వుద్దేశించి **"భగవంతుడు మరియు ప్రేమ"** అనే అంశంపై బాబా తన సందేశం ఇచ్చారు. స్థానిక ప్రముఖ న్యాయవాది శ్రీ ఎ.వి. ఖరే బాబావారి సందేశాన్ని చదివి వినిపించారు. ఆ సందేశ సారాంశం ఇలా వుంది. దయచేసి పరిశీలించగలరు.

***

ఆధ్యాత్మిక మార్గం అంత సుళువైనది కాదు.
ఈ మాటనే మరింత వివరంగా చెబుతూ బాబా ఇలా అన్నారు.
ఆధ్యాత్మిక మార్గం ఒక ఎత్తైన పర్వత శిఖరాన్ని ఎక్కినట్లన్నారు.
ఓ పర్వతాన్ని ఎక్కేటప్పుడు, ఆ పర్వత శిఖరాగ్రం చేరుకునేలోగా మరెన్నో చిన్నపాటి కొండలు, మరో చెంపన లోతైన లోయలు, ప్రమాదభరితమైన సెలయేళ్ళు, ముళ్ళ పొదలు ఇంకా ఎన్నో ఇలాంటివి ఎదురౌతాయి.
అలాగే ఆధ్యాత్మిక మార్గం పూలపాన్పులాంటిది కాదని నర్మగర్భంగా చెబుతూ, ఆధ్యాత్మిక మార్గాన క్షేమంగా ఉన్నతస్థితికి చేరుకోవాలంటే సాధకునికి "ప్రేమ ప్రధానం" అన్నారు. ఆ ప్రేమ సూచించే సున్నిత అంశాలన్నింటినీ విశ్వాసంతో ఆచరించగలిగితే ఆధ్యాత్మిక సాధన సుసాధ్యమే అని స్పష్టం చేశారు.
ఐతే, ఈ ప్రేమ యొక్క సూచనలను విస్మరిస్తే, సాధకునికి నిరాశనే మిగులుతుంది.
ఎవరైతే దైవీప్రేమలో **"నేను వేరు - భగవంతుడు వేరు"** అనే భావంతో వుంటారో అలాంటి వారికి మానవ జీవిత లక్ష్యమైన భగవదైక్య సాధన అత్యంత కష్టమౌతుందని" బాబా తన సందేశంలో ప్రకటించారు. మరో సందర్భంలో "ఆధ్యాత్మిక ప్రయాణం పదునైన కత్తి అంచుపై నడక వంటిదని" హెచ్చరించారు.
ఇదే విషయాన్ని వేదం "నాయమాత్మ బలహీనేన లభ్యతే " అన్నది.

***

# మెహెరాబాద్ తెలుగు-గుజరాతీల సహవాస్

## 1958 ఫిబ్రవరి 21 నుండి 26 వరకూ

**(గత సంచిక తరువాయి)**



రమా కల్చూరి తన కొడుకు మెహెర్‌నాథ్, షీలాలతో కలిసి వచ్చింది. మెహెర్‌నాథ్‌కు తీవ్ర జ్వరం వుంది. బాబా ఆమెను చూస్తూనే జ్వరంతో వున్న మెహెర్‌నాథ్‌ని ఎందుకు తీసుకొచ్చావ్? అని అడిగారు. వాడు నీ దర్శనం కావాలని ఏడుస్తుంటే, తప్పక తీసుకు రావాల్సివచ్చిందని చెప్పింది. బాబా మెహెర్‌నాథ్‌ని, షీలా నుదిటిన ప్రేమగా ముద్దుపెట్టుకున్నారు. తక్షణం ఇంటికి వెళ్ళిపొమ్మనమని బాబా వారిని ఆదేశించారు. ఆమె ఆ ప్రకారమే చేసింది. ఈ దర్శన సమయంలో వచ్చిన చిన్నారి పిల్లలతో బాబా ఎంతో ప్రేమగా ఆడుకున్నారు. వారిని తన దగ్గరకు తీసుకుని లాలించారు. వారికి చాక్లెట్లు, స్వీట్లు ఇచ్చారు. సహవాస్ జరుగుతుండగానే మధ్యలో ఒకమారు గోదావరి మాయితో బాబా మాట్లాడుతూ **"నేను ప్రతిఒక్కరిలో వున్నానన్నది ఖచ్చితం. మినుమిట్లు గొలిపే నా దివ్య కాంతి ముందు సూర్యుని వెలుగు కూడా చాలా తక్కువే. క్షణకాలం ఆ కాంతిని దర్శించుకున్నవారు తమ చైతన్యం కోల్పోగలరు. కాంతి మినహా వారికి ఇంకేమి కనపడదని"** అన్నారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో గోదావరిమాయి బాబా దగ్గర వీడ్కోలు తీసుకుని సాకోరికి బయల్దేరింది. కాగా ప్రజాదర్శన కార్యక్రమం సాయంత్రం 5.50 కల్లా ముగిసింది. చివరిగా పూణే భజన బృందాన్ని, ఇతర కార్యకర్తల్ని బాబా దర్శనం కోసం పిలిచారు. అనంతరం గుజరాతీ, హిందీ ఆరతుల ఆలాపనతో ఆనాటి కార్యక్రమం ముగిసిందని ప్రకటించారు. గుణతాయి గాడేకర్ ఆరతి కార్యక్రమం జరుగుతున్నంతసేపు వేదికపై ఒక పళ్ళెంలో కర్పూరం వెలుగుతుండేలా చూసింది. ఐతే, ఆరతి గానం చేస్తుండగా

మధ్యలో ఆరతి కొండ ఎక్కడం చూసిన బాబా, తిరిగి కర్పూరం వెలిగించమని అన్నారు. సహవాస్ ప్రాంగణాన్ని వదిలి
తన కారు దగ్గరకు వెళ్ళేందుకు ముందు యోగి సిద్ధానంద భారతికి బాబా తన ఆలింగనం ఇచ్చారు. ఆ పిదప బాబా లిఫ్ట్ చైర్‌లో కూర్చొనగా మెహెర్‌జీ, పేసి, మరో ఇద్దరు బాబా కుర్చీని కారు దాకా తీసుకెళ్ళి, బాబాని కారులో కూర్చోబెట్టారు. డెహ్రాడూన్ నుండి వచ్చిన ఫిల్ము డైరక్టర్ శ్రీ ప్రకాష్ ఛాబ్రా మెహెరాజాద్‌కి బాబా వెడుతున్న చిత్రాలను కూడా ఫిల్ము తీసాడు. సాయంత్రం ఆరు గంటల సమయంలో అవతార్ మెహెర్‌బాబాకిజై జయజయధ్వానాల నడుమ బాబా కారు మెహెరాజాద్‌కి బయల్దేరింది. కారులో బాబాతోపాటు శత్రుఘ్నకుమార్, కాకాబారియా, ఏరుచ్ వున్నారు. ఆ మర్నాడు ఉదయం 8 గంటలకల్లా బాబా తిరిగి మెహెరాబాద్‌కి వచ్చి తిన్నగా తన కాబిన్‌లోకి వెళ్ళారు. అక్కడ శ్రీ ప్రకాష్ ఛాబ్రా బాబాతో జరిపిన ఇంటర్వ్యూని ఫిల్ము తీశారు. ఛాబ్రా గొప్ప ధనవంతుడు.
"మోడ్రన్ ఇండియన్ సెయింట్స్ అండ్ సేజెస్" పేరిట భారతదేశంలోని ఆధ్యాత్మికంగా ఉన్నతమైన వారిని ఆతను ఫిల్ము తీస్తున్నాడు. ఆ చిత్రంలో బాబా కార్యక్రమాలను, సందేశాన్ని ఫిల్ముతీసేందుకై మెహెరాబాద్‌కి వచ్చాడాయన.
ఇదేమి కమర్షియల్ ఫిల్ము కాదు. ఇదొక డాక్యుమెంటరీ చిత్రమని చెప్పాడాయన.

**బాబా** – నన్ను అడగాల్సిన ప్రశ్నలు ఏమైనా ఉన్నాయా? అని ఛాబ్రాని అడిగారు.

**ఛాబ్రా** – బాబా నీవెందుకు మౌనంగా వుంటున్నావని బాబాని అడిగాడు.

**బాబా** – భగవంతుడు ఎందుకు మాట్లాడడని మీరెప్పుడైనా ప్రశ్నించారా? అని బాబా ప్రశ్నించారు.

**ఛాబ్రా** – నేను సామాన్యుడిని. ఈ భౌతిక ప్రపంచంలో, మెటీరియల్ ప్రపంచంలో వున్నాను. నాకు ఆ ప్రశ్నకు సమాధానం ఎలా తెలుస్తుందన్నాడు.

**బాబా** – నా మౌనంలోని నా మాటలు వినపడకపోతే, నా మాటల వల్ల లాభం ఏముంటుంది? అని బాబా అన్నారు. నీకేమైనా సహాయం కావాలా? అని అడిగారు బాబా. ఫిల్ము తీయడం సక్రమంగా సాగుతోందా? అని అడిగారు. నీకు కావాల్సినవన్నీ లభించాయా? అని వాకబు చేశారు

**ఛాబ్రా** – ఈ చిత్రాన్ని భారతీయ ప్రజానీకం కోసం తీస్తున్నాను. వారికి మీరేదైనా సందేశం ఇస్తే సంతోషంగా చిత్రీకరిస్తానని అన్నాడు.

**బాబా** – మెహెరాజాద్‌లో వుండగానే ఈ చిత్రీకరణ కోసం బాబా ముందుగా డిక్టేట్ చేసిన సందేశాన్ని ఏరుచ్‌కిచ్చి దాన్ని చదవి వినిపించమన్నారు. ఆ సందేశం ఇలా వుంది.

**“నిజమైన ఆనందం కోసం పరితపించే వ్యక్తి, తనపట్ల తాను కఠినంగానూ, ఇతరులపట్ల మరింత సహనంగా వుండాలని – ప్రవచనము ఇచ్చారు”.**

సుమారు 45 నిముషాల తర్వాత ఛాబ్రా ఇంటర్వ్యూ పూర్తయింది. ఫిల్ము తీసిన సిబ్బంది అందరూ బాబా కాబిన్ నుండి బైటకు వచ్చేశారు. విశేషం ఏమంటే, ఛాబ్రా తీసిన ఈ ఫిల్ము ఆ దరిమిలా వెలుగు చూడలేదు. ఆ చిత్రం కూడా కడదాకా పూర్తికాలేదు. జీసస్ క్రీస్తుపై మరో చిత్రం తీయాలని ఆతను జెరూసలేం వెళ్ళాడు.

వాటికిన్ నగరంలో పోప్‌ని కూడా ఇంటర్వ్యూ చేశాడు.

ఈ చిత్రం పూర్తిచేయడంలో కూడా ఆతను సఫలం కాలేదు.

పాపం!! మెహెరాబాద్‌లో నడియాడిన క్రీస్తుని స్వయంగా కలిసినట్లు ఆ చిత్ర నిర్మాత ఛాబ్రాకు తెలియకపోవడం గమనించాలి.

ఉదయం 8.30 కల్లా బాబాతో కలిసి స్త్రీ, పురుష ప్రేమికులందరూ ఎగువ మెహెరాబాద్‌కు బయల్దేరారు. మెహెర్‌జీ, పేసి, హెూషాంగ్ భరూచా, ఆదీ దుబాష్, క్రిష్ణ నాయర్, దిగంబర్ గాడేకర్, ప్రభృతులు విడతలవారీగా బాబావారి కుర్చీని మోసే అవకాశం, తమకు దక్కిన గౌరవంగా భావించారు. శత్రుఘ్నకుమార్ బాబాకు ఎండ తగలకుండా ఎప్పటిలా గొడుగు పట్టాడు. మెహెరాబాద్‌లోని రైల్వే క్రాసింగ్ దాటిన తర్వాత, ఫిల్ము నిర్మాత ఛబ్రా బృందం ముందుకెళ్ళి చిత్రీకరణకు అనువుగా బాబావారి కుర్చీని కొద్దిసేపు కిందకు దించారు. ఈ సమయంలోనే బాబా తన ముఖాన్ని బ్లాక్లాత్‌తో కప్పుకున్నారు. ఇది బాబావారి విశ్వ కార్యక్రమంలో భాగమని అందరూ అనుకున్నారు. ఎగువ మెహెరాబాద్‌లో టిన్ షెడ్‌లో బాబా కోసం సోఫా నొకదాన్ని ఏర్పాటు చేశారు. సహవాసీలందరికీ ఆ ప్రాంతం సరిపోదు కాబట్టి, బాబావారి సోఫాని విశాలమైన ప్రాంతానికి మార్చారు. బాబావారి ఎదుట వేసిన కార్పెట్‌పై ముందు వరుసలలో స్త్రీలు, వారి వెనుక పురుషులు వరుసగా కూర్చున్నారు. నెత్తిమీద సూర్యుడు పడుతున్నాడు. తలపై ఎండపడకుండా సహవాసీలను ఏదైనా కప్పుకోమన్నారు బాబా. బాబా చెప్పే మాటల్ని మండలి సభ్యులు అందరికీ వినపడేలా మైకు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంగణంలో చిన్న గుంతని బాబా చూసి, దాన్లో ఎవరైనా పడిపోతారేమోనని, ఆ గుంటలో హమీర్‌పూర్ ప్రేమికుడైన పుకార్‌జీని

నిలబడమన్నారు. కొద్దిసేపటి తర్వాత మినూ ఖరాస్ తలపైవున్న టోపిని బాబా తన చేతిలోకి తీసుకుని, ఆ గుంతలోకి విసిరేశారు. అంతక్రితం వారం విచ్చేసిన సహవాసీలకు చెప్పినట్లుగానే, ఎగువ మెహెరాబాద్‌లో చూడవల్సిన ప్రదేశాల గురించి క్లుప్తంగా వివరించారు. ముందుగా నిర్మించిన సమాధిలో బాబా చేసిన ఏకాంతవాసం, ఉపవాసం గురించి వివరించారు. బాబా దేహత్యాగం తర్వాత ఈ సమాధిలో తన భౌతిక దేహం ఇక్కడే వుంచుతారని, ఈ కొండ ప్రాంతం ప్రపంచంలోనే ఒక ప్రముఖ యాత్రా కేంద్రం అవుతుందని బాబా అన్నారు. ఈ రోజు దీని ప్రాముఖ్యత మీకు తెలియదు. 70 సంవత్సరాల తర్వాత ఈ ప్రదేశం ప్రముఖ యాత్రా స్థలాలకే యాత్రా కేంద్రం అవుతుందని బాబా అన్నారు. ఈ కొండ చుట్టుప్రక్కల పెద్ద పట్టణం వెలుస్తుందని అన్నారు. నేనుగా మిమ్మలి అందర్నీ నా భావి సమాధి దగ్గరకు తీసుకువచ్చాను. మీరెంత అదృష్టవంతులో మీకు తెలియదు. ఈ మాటనే నేను మొదటివారం జరిగిన సహవాసీలతో కూడా చెప్పానన్నారు బాబా. అనంతరం, భగవంతుడు తల్లిగా – తండ్రిగా అనే అంశంపై బాబావారిచ్చిన సందేశాన్ని ఏరుచ్‌ని చదివి వినిపించమన్నారు.

**–సశేషం**

## ముగియనున్న సీరియల్

**మెహెరాబాద్‌లో 1958 ఫిబ్రవరిలో ఏర్పాటు చేసిన సహవాస్ గురించి 2019 జనవరి నుండి ధారావాహిక సీరియల్‌గా మెహెర్‌బాబా పత్రికలో ప్రచురిస్తున్నాం. కాగా, ఈ సీరియల్ 2021 అక్టోబరుతో ముగియనుంది.** భిన్న భాషా ప్రాంతీయులు మెహెరాబాద్ పూదోటలో చక్కగా విహరించారు. వీరందరూ పరబ్రహ్మ, పరమాత్మ, దేవ దేవుడైన అవతారుని సన్నిధిలో ఓలలాడారు. సహవాసీలందరూ ధన్యులు.
ఈ సీరియల్‌పై మీ అభిప్రాయాన్ని తెలియజేయగలరు.

## మెహెర్‌శ్రీ వివాహం

శ్రీమతి & శ్రీ పోడూరి లక్ష్మి, రాజేంద్ర మెహెర్‌ల కుమార్తె చిలసౌ మెహెర్‌శ్రీ వివాహం శ్రీమతి & శ్రీ యల్లాప్రగడ నాగలక్ష్మి, కామేశ్వరరావు గారి కుమారుడు చి. జగదీష్ సిద్ధార్థ్‌తో 2021 ఆగస్టు 21న హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో విచ్చేసి నూతన వధూవరుల్ని ఆశీర్వదించారు. సుమారు ఏడాదిన్నర తర్వాత స్థానిక బాబా ప్రేమికులందరూ ఒకచోట కలుసుకునే అవకాశాన్ని మెహెర్‌శ్రీ–జగదీష్ సిద్ధార్థ్‌లు కల్పించారని పలువురు అభిప్రాయపడ్డారు.

## నవజీవనంలో మెహెర్‌బాబా

# కృష్ణ నాయర్‌కి ఇచ్చిన ప్రత్యేక ఆదేశం

**(1949 అక్టోబరు 16 నుండి నవజీవనం గడిపిన సందర్భంగా)**



మెహెర్‌బాబా 1949 అక్టోబరు 16 నుండి నవజీవనం గడపనున్నారని తెలిసి, నేను 1949 ఆగస్టు కల్లా మెహెరాజాద్‌కి చేరుకన్నాను. నవజీవనంలో పాల్గొనాలనుకున్నాను. ఆ సమయంలోనే నాకు కొడుకు పుట్టాడని మా ఇంటి నుండి ఉత్తరం వచ్చింది. నేను ఆ ఉత్తరాన్ని చదువుతుంటే బాబా నా ప్రక్కనే వచ్చి నిల్చున్నారు. ఆయన ఏమీ ఎరుగనట్లు విశేషం ఏమిటి? అని అడిగారు. కొడుకు పుట్టాడని చెప్పాను. ఐతే బాబా ఈ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దన్నారు. ఓ రోజున మండలి హాలులో అందరూ హాజరయిన సమయంలో బాబా నన్ను ఉద్దేశించి, నీ భార్యా, పిల్లవాడు ఎలా వున్నారని ప్రశ్నించారు. మండలివారంతా ఆశ్చర్యపడ్డారు. పెళ్ళి ఎప్పుడయింది. పిల్లవాడు ఎప్పుడు పుట్టాడని? మండలివారందరూ నన్ను ఆటపట్టించారు. డాక్టర్ ఘనీ అయితే మరొక అడుగు ముందుకేసి, కృష్ణకు పెళ్ళి కాకుండా కొడుకు పుట్టాడా? బాబా! ఏమి నీ మహత్యం!!! అని బాబాని అడిగాడు.. ఇలా కబుర్లు దొర్లుతున్నప్పుడు బాబా విష్ణు మాస్టర్ని పిలిచి గతంలో నేను పెళ్ళి చేసుకోబోను అని ఆవేశంతో నేను రక్తంతో రాసిన లేఖను తీసుకురమ్మన్నారు. ఆ కాగితాన్ని వెదికి విష్ణు పట్టుకొచ్చాడు. ఆ కాగితాన్ని చూపిస్తూ వీడు పెళ్ళి చేసుకోనని, నాతో బీరాలు పలికాడు. నాతో చాలెంజి కూడా చేశాడు. ప్రస్తుతం వీడు పెళ్ళి చేసుకున్నాడు. ఒక కొడుకు కూడా అని బాబా అనేసరికి, బాబాతో పాటు అందరూ గట్టిగా నవ్వుకున్నారు. మాకు ఈ శుభసమయంలో మంచి స్వీటు 'బాసుంది. కావాలని డాక్టర్ నీలూ అడిగేసరికి, నీవు నాకేసి చూడకు. నేను కాదు పెళ్ళి చేసుకుంది. కృష్ణుడే బాసుందీ ఇవ్వాల్సిందని బాబా నవ్విస్తూ అన్నారు. ఓ బాబా – నా దగ్గర డబ్బులు ఎక్కువున్నాయి అని నేననగానే, బాబానే

అందరికీ బాసుందీ ఏర్పాటు చేశారు.ఆనందంగా అందరం సంబరాలు చేసుకున్నాం. నవజీవన కార్యక్రమంలో నా పేరు లేదని, నేను పాల్గొనడం కుదరదని తెలిశాక నేనెంతో బాధపడ్డాను. నన్ను గమనించిన బాబా, ఏమయింది! అలాగున్నావ్? అని అడిగారు. దాంతో అప్పటిదాక నాలో నేను పడుతున్న బాధనంతా బాబా ఎదుట వెళ్ళగక్కాను. నేనేం తప్పుచేశానని, నవజీవనంలో పాల్గొనేవారి జాబితాలో నాపేరు లేదని బాబా అడిగాను. ఎందుకు అలా అడుగుతున్నావ్? నిన్నెవరు అడగమన్నారు అని బాబా తిరిగి నన్నే ప్రశ్నించారు. నేను గమ్మున వున్నాను. సమాధానం ఏమీ ఇవ్వక మిన్నకున్నాను. అప్పుడు బాబా నన్ను తన తలగడను ఎత్తమన్నారు. తలగడ దిండు క్రింద రెండువేల రూపాయలున్నాయి. బాబా నన్ను ఆ డబ్బుని తీసుకోమన్నారు. నాకు డబ్బు వద్దు బాబా అని రెండుసార్లు "వద్దు – వద్దు" అన్నాను. ఆ మాదిరిగా మాట్లాడొద్దు. విధేయుడిగా చెప్పింది చేయడమే నీ పని. ఆపై తాను చెప్పేది శ్రద్ధగా ఆలకించమన్నారు.

**బాబా నాకో ప్రత్యేకమైన ఆజ్ఞ ఇచ్చారు.**

అదేమంటే ఆ మర్నాడు ఉదయం 4 గంటలకు బయల్దేరి దేశంలో వున్న అన్ని ప్రముఖ దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు, ఇతర అన్ని పవిత్ర ప్రదేశాలకు వెళ్ళి ఆయా ప్రదేశాలలో మొదటి మెట్టు మీద 'మెహెర్‌బాబా' అని నామం తలుచుకుంటూ శిరస్సు వంచి ప్రణమిల్లమన్నారు. ఆ మర్నాడు ఉదయం నారిమన్ దాదా ఛాంజీ కారులో ముంబాయికి వెడుతుంటే నేను ఆయనతో బయల్దేరాను. బొంబాయికి చేరుకోగానే దాదర్ స్టేషన్ దగ్గర కారు దిగి నా మానాన బాబా ఆజ్ఞ ప్రకారం తీర్థయాత్ర కొనసాగించాను. ఆ రోజు మంగళవారమయ్యింది. ప్రప్రథమంగా, సిద్ధి వినాయకుని ఆలయానికి వెళ్ళాను. అక్కడ బాబా నామం తలచుకుని స్వామికి ప్రణమిల్లాను. అలా తలవంచి ఎత్తి చూస్తును కదా బాబా నాకళ్ళెదుట దర్శన మిచ్చారు. ఆశ్చర్యం. కొన్ని క్షణాలు బాబా దర్శనం నాకళ్ళెదుట చాలా స్పష్టంగా కనిపించింది. ఆ తర్వాత ముంబాయిలోని ప్రిన్సెస్ వీధిలోని పార్శీ దేవాలయానికి వెళ్ళాను. నేను పార్శీ వాడిని కాదని వాళ్ళు లోనికి అనుమతించలేదు. సరికదా, చాలా అమర్యాదగా ప్రవర్తించారు. ఇంతలో నాకు తెలిసిన ఒక వ్యక్తి తారసపడ్డాడు. అతని సహాయంతో లోనికి వెళ్ళాను. అక్కడ కూడా 'మెహెర్ బాబా' అని నా శిరస్సు వంచి ప్రణమిల్లగా బాబా నిలువెత్తు దర్శనం తిరిగి లభించింది. ఆ తర్వాత్తర్వాత నేను ముంబాయిలో ముంబాదేవి ఆలయం, కలకత్తాలోని కాళీమాత ఆలయం, ఇలా అనేక దేవాలయాలు, గురుద్వారాలు, పలు పవిత్ర పుణ్యతీర్థాలు పర్యటించాను. వెళ్ళిన చోటల్లా నాకు

బాబా దర్శనమిచ్చారు. నేను వారణాశికి వెళ్ళాలని అక్కడికెళ్ళే రైలులో ప్రయాణిస్తుంటే, ఆశ్చర్యకరంగా, అనుకోకుండా నేను రైల్లో వెళ్ళే దిశకు వ్యతిరేకంగా వెళ్తున్న రైల్లో ప్రయాణిస్తున్న బాబా నాకు కనిపించారు. నన్ను పలకరించవల్సి వస్తుందని బాబా నన్ను చూసి తన తలను ప్రక్కకు తిప్పేసుకున్నారు. ఆ తర్వాత, నేను మధురై, చెన్నై తదితర ప్రదేశాలలో చాలా పుణ్యతీర్థాలకు వెళ్ళాను. చివరిగా కేరళ రాష్ట్రంలోని అయ్యప్ప దేవాలయానికి వెళ్ళాను. అక్కడి ఆచారం ప్రకారం నల్ల దుస్తులు ధరించాను. ఆరుసార్లు అయ్యప్పను దర్శించుకున్నాను. గతంలోని ప్రదేశాల్లో మాదిరి ఇక్కడ బాబా నాకు దర్శనం ఇవ్వలేదు. గతంలో నేను రమారమిని 90 ప్రదేశాలలో బాబాను దర్శించుకున్నాను. అయప్ప ఆలయంలో బాబా దర్శనం కాకపోవడంతో, నాలో ఏదో దోషముందని భయపడ్డాను. బాధపడ్డాను. తెలిసో, తెలియకనో తప్పుచేశాననుకున్నాను. అందుకే అవతారుడు దర్శనం ఇవ్వలేదని బాధపడ్డాను. అయ్యప్పస్వామి దర్శనార్థం వెళ్ళేటప్పుడల్లా, సుమారు ఆరుసార్లు నాతో కొబ్బరికాయ తీసుకెళ్ళాను. ఏడవసారి వెళ్ళేటప్పుడు నారికేళం తీసుకెళ్ళలేదు. బాబా నామం తలుచుకుంటూ స్వామికి ప్రణమిల్లాను. ఏడవసారి బాబా దర్శనం ఎప్పటిలా లభించింది. అప్పుడు నాకేమనిపించిందంటే కొబ్బరికాయలు, అగరబత్తీలు – కర్పూర నీరాజనాలు వంటి కర్మకాండలు బాబాకు ఇష్టముండదని, ఆ కారణంగానే ఆయన దర్శనం గత ఆరుసార్లు లభించలేదని నాకు రూఢి అయింది. అంతేకాదు నేను స్వామికి భక్తితో ప్రణమిల్లినప్పుడు, నా ప్రక్కనే వున్న ఒక భక్తుడు కొబ్బరికాయ కొట్టబోతూ, ఏదో పోలీస్ విజిల్ వినిపించడంతో ఆతను ఎత్తిన చేయి ఎత్తినట్లే వున్నాడు. లేదంటే ఆ నారికేళాన్ని నా తలపై కొట్టి వుండేవాడని ఆ తర్వాత తెలిసింది. బాబా తన సందేశంలో పలుసార్లు చెప్పినట్లు అన్ని పుణ్యక్షేత్రాల్లో దేవాలయాల్లో, చర్చిల్లో, మసీదు, గురుద్వారా ఇలా అన్నిచోట్లా ఉన్నది తానేనని నాకు ఈ మాదిరిగా రుజువు చేశారని నాకిప్పుడు అనిపించింది. అయ్యప్పస్వామి దేవాలయం నుంచి నా స్వగ్రామం చాలా దగ్గర కాబట్టి నేను మా ఊరుకి వెళ్ళాను. అలా వెళ్ళాను కానీ, బ్రతకడానికి జీవన భృతి ఎలాగో తోచకుంది. ఆ దరిమిలా తెలంగాణా ప్రాంతంలోని వరంగల్లుకు ఒక స్నేహితునితో కలిసి వచ్చాను. ఇక్కడ ఒక పోలీసు ఆఫీసరు దగ్గర నౌకరీకి చేరాను. ఉద్యోగంలో చేరేముందర నాతో 5 సంవత్సరాలు ఆ ఉద్యోగం వదిలివెళ్ళనని బాండు రాసి ఇచ్చాను.ఒక రోజున మా పోలీస్ బాస్ తన పనిమీద నన్ను హైదరాబాద్ పంపాడు. నేను వరంగల్లులో వున్నప్పుడే ఆదీ కె ఇరానీ బాబా హైదరాబాద్లో వున్నారని, ఒక ఉత్తరం రాశారు. బాబా ఆ సమయంలో జూబ్లీహిల్స్‌లో వున్నారు. నేను ఎలాగో బాబా వారుంటున్న అడ్రస్సు చేతబుచ్చుకుని జూబ్లీహిల్స్‌లోని బాబా ఉంటున్న

బంగళాకు చేరాను. బంగళా బయట కాపలా వున్న బాబా మండలి సభ్యుడు నన్ను గుర్తుపట్ట లేదు. నన్ను లోనికి అనుమతించలేదు. ఆ దరిమిలా నేనెవరో చెప్పాక, బాబాకు చెప్పి, బాబాను కలిసే ఏర్పాటు చేశాడు. నేనేం చేస్తున్నాను, ఎక్కడ వుంటున్నాను, నన్ను గుర్తుంచుకున్నావా? లాంటి కుశల ప్రశ్నలు అడిగారు. నేను చేసిన పుణ్యతీర్థాల యాత్ర గురించి, నాకు లభించిన బాబా దర్శన భాగ్యం గురించి, వరంగల్లులో నేను చేస్తున్న ఉద్యోగం, అక్కడ వారికి నేను రాసి ఇచ్చిన బాండు గురించి, అన్ని విషయాలు బాబాతో చెప్పాను. నవజీవనంలో పాల్గొనే అవకాశం నాకివ్వలేదని బాబాకు గుర్తుచేశాను. ఆ పిదప బాబాతో ఉండటానికి రమ్మన్నారు. ఐతే, నేను పనిచేస్తున్న పోలీసు ఆఫీసరు అంగీకరిస్తేనే రావాలని బాబా షరతు విధించారు. నేను వరంగల్లుకు తిరిగి వచ్చి, మా బాస్ డి.ఎస్.పి ని నన్ను ఉద్యోగం నుంచి రిలీవ్ చేయమని అడిగాను. కారణాలు ఏమీ అడగకుండానే ఇంతక్రితం వరకు ఎక్కడ పనిచేస్తుండేవాడివని ఆయన అడిగాడు. నేను మెహెర్‌బాబాతో ఉండేవాడినని, తిరిగి ఆయన దగ్గరకే వెళ్ళేందుకు ఇష్టపడుతున్నానని చెప్పాను. ప్రస్తుత పరిస్థితుల్లో నన్ను ఉద్యోగం నుంచి తప్పించడం కష్టమని డి.ఎస్.పి అన్నాడు. కానీ ఆ తర్వాత ఆయనే నన్ను వరంగల్లులోని ఫలానా డాక్టరు దగ్గర మెడికల్ సర్టిఫికెట్ తీసుకురమ్మని చెప్పాడు. నా ఎదుటనే మా డి.ఎస్.పి ఆ డాక్టరు గారికి ఫోన్ చేసి ఆ మెడికల్ సర్టిఫికెట్ ఎలా వుండాలో వివరంగా చెప్పాడు. ఈ విషయంలో బాబానే నాకు ఎనలేని సహాయం చేశారు. డాక్టరు సర్టిఫికెట్ ఇవ్వగానే నన్ను ఉద్యోగం నుంచి రిలీవ్ చేశారు. అవతారుని సన్నిధిలో కాలం గడిపానని, కృష్ణ నాయర్ బాబా నవజీవన సమయంలో తనకిచ్చిన అరుదైన ఆదేశాన్ని తెలియజేశారు.

**కృష్ణనాయర్ అనుభవాలు -సార్థకజన్ములు తెలుగు అనువాద గ్రంథం నుండి**


# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్‌బాబా నామం ఎక్కువమంది పాఠకులకు అందజేసేందుకు వీలుగా మీ బంధు మిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రికకు వార్షిక, జీవిత సభ్యత్వం చెల్లింపజేయండి. పత్రిక పదివేల సైన్యంతో సమానమని గమనించ గలరు. మరిన్ని వివరాలకు 99595-53218 సంప్రదించండి.

## పుస్తక సమీక్ష

**కొత్తగా ప్రచురించిన బాబా సాహిత్య గ్రంథాలను, పుస్తక సమీక్ష కోరువారు ఆ పుస్తక రెండు ప్రతులను మెహెర్‌బాబా పత్రిక చిరునామాకు పంపగలరు.**

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.

మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమున గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,

త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మావు,
పరమాత్మవు
అల్లాహ్,
ఇలాహీ,
యజ్దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

---

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!
నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు బాబా కొంగును చిట్టచివరి వరకు దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యత్వం

**2021 సెప్టెంబర్ నెలలలో పంపిన వారి వివరాలు**

| నెం. | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|
| 1. | శ్రీ అచంట ఫణి, మార్టేరు, ప.గో.జి | రూ 500/- |
| 2. | శ్రీ కె. మహేష్, నర్సిపట్నం, విశాఖ జిల్లా | రూ. 1000/- |
| 3. | శ్రీ పుల్ల సత్యనారాయణ, నర్సిపట్నం, విశాఖ జిల్లా | రూ. 1000/- |
| 4. | శ్రీ కె.యోగానందరావు, విజయవాడ, కృష్ణా జిల్లా | రూ. 1000/- |
| 5. | హెడ్మాస్టర్, జడ్.పి.హైస్కూలు, ప్రకాశ్‌రావుపాలెం,పగోజి. | రూ. 1000/- |
| 6. | హెడ్మాస్టర్, జడ్.పి. హైస్కూలు, సంగరాజుపాలెం,పగోజి. | రూ. 1000/- |
| 7. | హెడ్మాస్టర్, జడ్.పి. హైస్కూలు, నల్లజర్ల, ప.గో.జి. | రూ. 1000/- |
| 8. | బ్రాంచి లైబ్రరి, నల్లజర్ల, పగోజి. | రూ. 1000/- |
| 9. | ఎ.కె.ఆర్.జి. కాలేజి, నల్లజర్ల, ప.గో.జి. | రూ. 1000/- |
| 10. | ఎస్.ఆర్.కె.ఎస్.ఆర్. కాలేజి, నల్లజర్ల, ప.గో.జి. | రూ. 1000/- |
| 11. | అక్కిన రామచంద్రరావు, వడిశలేరు, తూ.గో.జి. | రూ. 1000/- |
| 12. | బి.నందగోపాల్, అనంతపురం | రూ. 1000/- |

**మా అడ్రస్:**

**ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,**
యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ పోస్టు,
సికింద్రాబాద్-500087. **ఫోన్: 99595-53218.**
**email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad. **Editor: D. Nirmaladevi**

**RNI No. APTEL/2002/7310, Postal Concession: HSE/789/2020-2022 Dt.20-01-2020, Date of Publication 20h of every month, Posted at Patrika Channel on 25 / 26th every month.**